POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మే 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 43 సంచిక: 01



శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి స్వామి


## ఈ నెల పండుగలు

మే 11 - శ్రీ సాయిలీలామృత గ్రంథ కృతజ్ఞతార్చన

మే 12 - బుద్ధ పూర్ణిమ

మే 20 - శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి స్వామి (కంచి పెద్దస్వామి) జయంతి

మే 21 - పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి ఆరాధన (తిథి వైశాఖ బహుళ నవమి)




## 'శ్రీ సాయిలీలామృతము'

### మహాగ్రంథ కృతజ్ఞతార్చన

మే 11, 2025

# సాధనకి తత్త్వజ్ఞానం ఎంతో అవసరం

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

వ్యవసాయం చేయాలంటే ముందు నేలను ఎంతో సంస్కరించాలి. అలానే ధ్యానం సరిగా అభ్యసించగల్గాలంటే మనస్సునెంతగానో సంస్కరించాలి. అన్నిటికంటే ముఖ్యం భావశుద్ధి. సృష్టి, మానవుడు, జీవితతత్త్వాల గురించి మనకు అజ్ఞానజనితాలైన ఎన్నో పొరపాటు భావాలుంటాయి. సరిగా వాటి తత్త్వాన్ని తెలుసుకుంటే గాని భ్రాంతులు, వ్యామోహాలు తొలగవు. మనస్సు వాటిచేత చంచలమవుతుంది. ఆ చాంచల్యం తొలగాలంటే వ్యామోహాలు తొలగాలి. అందుకు వస్తువుల యొక్క, జీవితం యొక్క తత్త్వం చక్కగా అర్థంగావాలి. అందుకే భక్తి, జ్ఞాన, అష్టాంగ యోగాలన్నింటిలో తత్త్వజ్ఞానం చాలా ఆవశ్యకం.

భక్తిమార్గంలో మనకు గోచరించే యీ స్థూల ప్రపంచమొక్కటే వాస్తవంగాదని, మన ప్రాకృతిక జీవితం దుఃఖమయమని, దానినుండి విడివడగల్గితే ఆనందమయమైన భగవత్స్వరూపం అనుభవమవుతుందని దృఢంగా తెలుసుకోవాలి. గుడ్డిగా నమ్మడంకాదు.

ఎంత యత్నించినా మనకు స్పష్టంగా తెలియని దానిని దృఢంగా నమ్మసాధ్యంకాదు. శంక ఏదో ఒక మూలదాగివుండి, మన యత్నాన్ని బలహీనపరిచి భగ్నం చేస్తుంది. క్షుణ్ణంగా తెలిస్తే దృఢమైన నిశ్చయంగల్గి లక్ష్యంపై అపారమైన కోరిక కల్గుతుంది. స్థూలజగత్తులో గోచరించే వస్తువులు, జీవితానుభవాలే పరమ సత్యంగాదని తెలియబట్టి వాటికి మనపై ప్రాబల్యం తగ్గుతుంది. జగత్తుపట్ల వ్యామోహం తగ్గి, ఆనందరూపుడైన పరమాత్మపట్ల నిశ్చయాత్మకమైన ప్రీతికల్గి కృతార్థత చేకూరేవరకూ మన యత్నాన్ని సడలనివ్వదు.

జ్ఞానమార్గంలో గూడ శ్రవణ, మనన, నిదిధ్యాసలనందుకే చెప్పారు.

కొందరు అటు జ్ఞానంగాని, ఇటు భక్తిగాని అష్టాంగయోగాని కవసరంలేదని తలుస్తారు. కానీ అది సరికాదు. యమ, నియమాలు, ఆసన ప్రాణాయామాలు అష్టాంగయోగానికి ప్రధాన సోపానాలుగా చెప్పబడ్డాయి. యమనియమాలంటే యింద్రియ మనోనిగ్రహం. మనస్సును నిగ్రహించకుండా యింద్రియాలను మాత్రమే నిగ్రహించడం మిథ్యాచారమని, నిష్ప్రయోజనమని గీత స్పష్టంగా చెబుతోంది. కనుక మనస్సును మొదట జయించాలి. అంటే అజ్ఞానంచేత వస్తువుపట్ల, జీవితానుభవముపట్ల మనకు సామాన్యంగా వుండే భ్రాంతి తొలగాలి. అందుకు వస్తువుల, జీవితానుభవాల వాస్తవత్వం అర్థం కావాలి. అలా భ్రాంతులు తొలగిన యింద్రియాలు చాలావరకు వాటంతటవే అదుపులో వుంటాయి. దీనికితోడు యోగసిద్ధి ఫలమైన శాశ్వతానందంపట్లగల తీవ్రమైన ప్రీతి ధ్యేయంపైన మనసు నిలిచేలాగ చేస్తుంది. ఈవిషయాన్నే గీత యిలా చెబుతుంది.

**నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా।**
**న చాభావయతః శాన్తిరశాన్తస్య కుతః సుఖమ్॥**

(అ.2, శ్లో.66)

తా॥ : మనస్సమాధానములేని అయుక్తునకు

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 మే - 2025 సంచిక:01

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాధనకి తత్త్వజ్ఞానం ఎంతో అవసరం | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | శ్రీ గుంటూరు నల్లమస్తాన్ సాహెబ్ జీ | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి సుధారాణి | 12 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 14 |
| 06. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 07. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 08. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 21 |
| 09. | పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల 36వ ఆరాధనా మహోత్సవం! | శ్రీమతి టి. పద్మావతి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి పిసుపాటి సుబ్బమ్మ | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి కృష్ణకుమారి | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ఆత్మధ్యానమను భావనలేదు. (అనగా ఆత్మస్వరూప జ్ఞానమను బుద్ధిలేదు) భావనలేని వానికి శాంతిలేదు. శాంతిలేని వానికి సుఖములేదు.

అందుకే యాజ్ఞవల్క్యుడు ఆధ్యాత్మవిద్యను ఉపదేశింపదగినవారి గూర్చి యిలా అన్నాడు:

**విధ్యుక్త కర్మ సంయుక్తం కామ సంకల్ప వర్జితః।**
**యస్య తస్యాధికారోస్మిన్ యోగీ నాన్యస్య కస్యచిత్ ॥**

తా॥ : ఋషులచేత విధించబడిన సత్కర్మలను శ్రద్ధగా ఆచరించేవాడు, కామ సంకల్పాలను విడిచినవాడు, యమనియమాలు కలవాడు, సర్వ వ్యామోహములను విడిచినవాడు.

వాయుసంహిత గూడ యిలా చెబుతోంది:

**"దృష్టే తథాను శ్రవికే విరక్తం విషయే"**

"ఇహలోక పరలోక విషయములందు విరక్తిగల చిత్తముగలవాడికే యోగమునందు అధికారము గలదు. తదితరులకు లేదు".

అలానే వేదాంతోపదేశాలను వింటూ యోగాన్నభ్యసించాలని శాండిల్యోపనిషత్తు, శివయోగ దీపిక చెబుతాయి.

హఠయోగ ప్రదీపిక గూడ యిలా చెబుతున్నది.

**"ఉత్సాహూత్సాహసాధైర్యా తత్త్వజ్ఞానాశ్చ నిశ్చయాత్।**
**జ్ఞానసజ్ఞ పరిత్యాగాత్ షడ్భిర్యోగః ప్రసిద్ధ్యతి॥"**

తా॥ : "ఉత్సాహ, సాహస, ధైర్య, తత్త్వజ్ఞానమువలన, దానివలన గల్గిన నిశ్చయంవలన యోగసిద్ధి కల్గుతుంది.

'నిశ్చయాత్' అన్నమాటకు బ్రహ్మానందస్వామి విషయములన్నియు మృగతృష్ణవలె అసత్యములని, బ్రహ్మమొక్కటే సత్యమని, తత్త్వజ్ఞానము, శాస్త్రము, గురువాక్యములందుగల విశ్వాసము అనీ వివరించారు.

అంటే సృష్టితత్త్వము, జీవితానుభవతత్త్వమూ తెలుసుకోవడం సాధనామార్గాలన్నింటికీ పునాది. పునాది దృఢముగాలేని యిల్లు నిలువదుగదా! అందుకే "మతం ఎందుకు?", "విజ్ఞానవీచికలు" ముముక్షువులందరూ తప్పకచదవాలి. రెండవ గ్రంథంలో ఆర్ష తత్త్వజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానంతో సమన్వయించడం జరిగింది గనుక నేటివారికెంతో అది ఉపకరిస్తుంది. నేటి విజ్ఞానశాస్త్రాలను విద్యాలయాలలో అధ్యయనంచేసిన, చేస్తున్నవారికి యిలా సమన్వయించి చెప్పకుంటే 'ఆధ్యాత్మికత వైజ్ఞానిక యోచనకు నిలువజాలని భ్రమ' అన్న శంక మిగిలిపోతుంది. కనుక యీనాటి ధర్మప్రచారకులందరూగూడ పై గ్రంథాన్ని పరిశీలించనిదే వారిప్రచారం నూనెరాసిన శరీరంమీద నీటిలాగ మనస్సులకు అంటదు.

ఇట్టి వైజ్ఞానిక-తాత్త్విక దృష్టిని వహించే, సృష్టిపట్ల అట్టి లోచూపుతోనే పూజాదికాలు నిర్వర్తించాలని తెల్పడానికే సామాన్యమైన షోడశోపచార పూజలో పురుషసూక్తాన్ని వినియోగిస్తారు. పురుషసూక్తమంతా సృష్టినంతటినీ యిట్టి వైజ్ఞానిక తాత్త్వికదృష్టితో చూపేదేనని పై గ్రంథాలు చదివాక 'పురుషసూక్త రహస్యం" అన్న చిన్న గ్రంథం చదివితే తెలుస్తుంది. ఇది చదివి సరియైన అవగాహన పొందనిదే సాధన నిర్దుష్టం కాజాలదు.

పై గ్రంథాలు చదవడం శ్రమ అని చాలామంది వాటినుపేక్షిస్తున్నారంటే అర్థం నేటి సాధకులు, ముముక్షువులు, ధర్మప్రచారకులలో ఎక్కువమంది నిజమైన సాధకులు మొ॥నవారు కారన్నమాట.

సాధ్యం మీద ప్రీతియున్నపుడు ఎంత శ్రమించైనా మనిషి సాధనాలను సేకరిస్తాడు. డబ్బు, సంసారలంపటమూ గలవారు వాటికోసమెంతైనా ఎలా శ్రమించి వాటిని నెరవేర్చుకునే మార్గాలను తెలుసుకుంటున్నారో చూడండి. అటువంటప్పుడు సర్వదుఃఖాలకూ అతీతమైన శాశ్వతానందాన్ని పొందగోరేవారు రెండుమూడు ముఖ్యమైన గ్రంథాలను చదవడానికి బాధపడతారా?

చివరికి ఒక్కమాట. సద్గురువునాశ్రయించినవాడికి - నిజంగా 'శ్రీసాయినాథ ప్రబోధామృతము' లో వివరించినట్లు ఆశ్రయిస్తే - అష్టాంగయోగాదులు వాటికై అవే సిద్ధిస్తాయని శాస్త్రవాక్యం.

రాజయోగమనే గ్రంథమిలా చెబుతోంది:

**వేదాన్తతర్కోక్తిభిరాగమైశ్చ, నానావిధైః శాస్త్రకదంబకైశ్చ।**
**ధ్యానాదిభిః సత్కరణైగమ్యశ్చిన్తామణిహ్యేక గురుం వినా॥**

తా॥ : చింతామణియైన గురువొక్కడు లేక,

***మిగతా 11వ పేజీలో***

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న :- మృత్యువు తప్పదని కూడ మృతుంజయ జపం చేయాలని, చేస్తే మృత్యువును జయించవచ్చునని చెప్పడమేమిటి? ఎంతవారైనా విధికి తలవంచవలసినదేగదా ?**

**- ఒక జిజ్ఞాసువు**

**జవాబు :-** చాలా మంచి ప్రశ్న! మృత్యువును జయించవచ్చని ఋషులు చెప్పిన భావ మొకటైతే, యీనాటి 'పెద్దలు' చెప్పే భావం వేరొకటి! అసలు పండితుల, జ్ఞానుల లక్షణం వేరు. "గతాసూన గతాసూంశ్చ నాను శోచంతి పండితాః" అన్నాడు కృష్ణుడు (భగవద్గీత). 'జ్ఞానులు చనిపోవడం గురించి చనిపోకపోవడం గురించి చింతించరు' అని గీత చెప్పినది. కనుక చనిపోతామని భయపడేవారే దానినిలా తప్పుకునే యత్నం చేసి విఫలులవుతారు. చనిపోయేది దేహమే. పుట్టిన ప్రతీది ఏనాటికైనా చావవలసినదే (గీత). ఈ ప్రకృతి మాత్రమే భగవంతుని శాసనం – అదే విధి. దానికి రాముడు, కృష్ణుడు, పామరుడూ – అందరూ తల ఒగ్గవలసినదే.

అయితే నశించేది దేహమే. దానికి జన్మ వున్నది గనుక మృత్యువు వుండవలసినదే. అయితే జీవుడు కేవల చైతన్య స్వరూపి గనుక అతడికి మరణమూ లేదు, జననమూ లేదు. అంటే ఎన్నిసార్లు జన్మించి మరణించినా, జరిగేది అతడా దేహాలను నిర్మించుకోడం, శిథిలం కాగానే విడిచివేయడమూ మాత్రమే. ఇది ఆ జీవి అజ్ఞానంలో వున్నంతవరకూ జరగవలసినదే. నిరంతర సాధన వలన తాను నిజానికి సర్వగతమైన బ్రహ్మమేనన్న జ్ఞానం కల్గిననాడు – తాను పరిమితుడు, అల్పజ్ఞుడూ అన్న భ్రాంతి వీడుతుంది. అంతటితో జననం నుండీ, మరణంనుండీ – అంటే ఒక శరీరాన్ని నిర్మించుకోవడం, దానిని నశింపచేసుకోవడమనే అవసరం నుండి విడివడుతాడు. జ్ఞానము, సాధన జీవించి యుండగానే సాధ్యం గనుక, జ్ఞానం కల్గితే గాని దుఃఖరాహిత్యం కల్గదు గనుక, అది కలిగేవరకూ జీవుడు దేహాలను ధరిస్తూ, విడుస్తూ వుండవలసినదే.

అనేక జన్మల సాధన వలన క్రమంగా జ్ఞానం పక్వమవుతూవచ్చి, అది పూర్తి పక్వస్థితినందినపుడు యిక జన్మించవలసిన అగత్యం నుండి విడివడుతాడు. అంటే తిరిగి, తిరిగి మరణించవలసిన దుస్థితి నుండి విడివడుతాడు. పరీక్ష పాసవడంతో మరల మరల పరీక్షకు హాజరుకావలసిన, మరల చదువవలసిన, అగత్యం నుండి విడివడుతాడు విద్యార్థి.

పూర్ణమైన ఆత్మజ్ఞానం వలన యిలా మృత్యువునుండి విడివడుతాడనీ, అట్టి పక్వజ్ఞానం త్రయంబకుడైన పరమేశ్వరుణ్ణి 'యజనం' చేసినందువలన కలుగుతుందనీ చెబుతుంది మృత్యుంజయ మంత్రం. 'యజన' మంటే సర్వవిధములా, సర్వకాల సర్వావస్థలయందూ

*మిగతా 29వ పేజీలో*

(మే 2017 సాయిబాబా మాసపత్రిక నుండి)

# శ్రీ గుంటూరు నల్లమస్తాన్ సాహెబ్ జీ

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

ఒక భక్తుడు విశ్వనాథుని దర్శనానికై కాశీ వెళ్ళాడు. అతడొక రోజున కాశీ పట్టణ వీధులగుండా వెళ్తూండగా ఒకచోట మశీదు కనిపించింది. దాని ప్రాంగణంలో కూర్చునివున్న ఒక వృద్ధుడు యితనిని పిలిచి, "నీది గుంటూరుగదా? అక్కడ నల్లమస్తాన్ సాహెబ్ బాగున్నాడా? వాడు నా బాల్యమిత్రుడు. 200 సం॥ల క్రితం నేనతణ్ణి చూచాను" అన్నాడు. ఆ మాటలు వినిన ఆ భక్తుడు ఆశ్చర్యపోయాడు. కారణం అతడు గుంటూరు నల్లమస్తాన్‌గారి భక్తుడే! తన సంగతి, నల్లమస్తాన్‌గారి సంగతి తెలిసిన ఆ వృద్ధుడు, వీరిద్దరి సంబంధము, వయస్సు – యివన్నీ ఆలోచించిన అతడికి వారిద్దరూ సామాన్యులు గారనీ, మహామహిమాన్వితులని తెలిసింది. వెంటనే అతడా వృద్ధుని పాదాలపైబడి నమస్కరించి, మస్తాన్ గారి వివరాలు చెప్పాడు. తర్వాత అతడు గుంటూరు చేరి, ఒకరోజు మస్తాన్ గారి దర్శనానికి వెళ్ళాడు. అపుడాయన ధ్యానంలో వున్నారు. చాలామంది వారి ఆశీస్సులకై వేచివున్నారు. సుమారొక గంట తర్వాత మస్తాన్ గారు కండ్లు తెరచి, భక్తుల సమస్యలు విని ఆశీర్వదించి పంపాక, ఈ భక్తునితో, "కాశీలో నన్నడిగిన మిత్రుడు బాగున్నాడా?" అన్నారు. ఈ మాటలకు మరింత అశ్చర్యపోతూ అతడు, "అవును ఆ సంగతి తమకు విన్నవించడానికే వచ్చాను" అంటూ నమస్కరించాడు.

అది దాదాపు వంద సంవత్సరాల క్రిందటి మాట. ఒక ప్రక్క గులకరాళ్ళ గంప, మరో ప్రక్క చింపిరి గుడ్డల మూట వున్న కావడి భుజాన మోస్తూ వృద్ధుడైన కాలేషా మస్తాన్ వలీగారు గుంటూరు పట్టణంలోనూ పరిసర ప్రాంతాలలోనూ పిచ్చివానిలా తిరుగుతూండేవారు. ఆయన వెంట ఎప్పుడూ ఒక కోడి, కుక్క, మేక వుండేవి. పిచ్చివానిలా కన్పించే ఆయన అవధూత, మహాజ్ఞానియని తెలిపే లీలల నెన్నింటినో నాటి ప్రజలు చూచారు. గుంటూరులో ఈ 'నల్లమస్తాన్' గారి పేరు విననివారు, ఆయన దర్గా దర్శించనివారూ ఎంతో అరుదు. ఇప్పటికీ గుంటూరు ప్రాంతపు ప్రజలు ఆయన ఉరుసు మహోత్సవాన్ని మహావైభవంగా జరుపుకుంటారు.

ఆయన వృద్ధుడే! అయితే ఆ వృద్ధత్వం ఎన్నాళ్టిదో ఎవరికీ అంతుబట్టలేదు. ఆయన 1885లో సమాధి చెందారు. ఆనాటికే శతవృద్ధులైన కొందరు, తమ చిన్నతనం నుండి ఆయన అలానే వున్నారనీ, వారి తల్లిదండ్రులు గూడ వారి చిన్నతనంనుండి ఆయనలానే వున్నట్లు చెప్పే వారనీ, కనుక ఆయన వయస్సు 250 సం॥లకు తక్కువ వుండదనీ ఖచ్చితంగా చెప్పేవారట. పైన చెప్పుకున్న సంఘటన గూడ అందుకుదాహరణే.

ఆయన మహమ్మదీయులు, సయ్యద్ వంశస్థులు. వీరు తిరుచునాపల్లిలో జన్మించారు. వీరు గుంటూరు ప్రాంతానికి యెప్పుడు యెలా వచ్చారో యిదమిద్ధంగా

ఎవరికీ తెలియదు.

ఆయన ఎక్కువగా తిరుగుతూ, అప్పుడప్పుడు యే చెట్టు క్రిందనో ధ్యానస్థులై కూర్చుండేవారు. ఆయన నిద్రించడంగానీ, పడుకోవడంగానీ ఎవరూ చూడలేదట. ఆయన మితభాషి. తమ దర్శనానికి వచ్చిన భక్తులతో ఒకటి రెండు మాటలు మాత్రం మాట్లాడేవారు. భక్తులు ఆయన దర్శనం కోసం, ఆశీర్వచనం కోసం గంటలు, ఒక్కొక్కసారి రోజుల తరబడి వేచివుండవలసి వచ్చేది.

ఆయన నిరాడంబరుడు. కానీ ఆయన లీలలు అత్యద్భుతాలు, చిత్రవిచిత్రాలు.

ఒకనాడు భవాని అనే ఆమె మస్తాన్ గారి దగ్గర వున్న కోడిని దొంగతనంగా తీసుకెళ్ళి కోసి, వండుకోవడానికని మాంసం సిద్ధంగా గిన్నెలో పెట్టుకుంది. ఇంతలో మస్తాన్‌గారు తమదగ్గర కోడిలేకపోవడం గమనించి, సరాసరి భవాని యింటికెళ్ళారు. అక్కడ ఆ మాంసపు ముద్దను చూచి, “ భో, భో” అని పిలిచారు. ఆశ్చర్యం! వెంటనే ఆ మాంసం కాస్తా కోడిగా మారి పరుగెత్తుకుంటూ మస్తాన్‌గారి దగ్గరకు వచ్చింది. ఈ అద్భుతం చూచిన భవాని ఆయనను క్షమాపణ కోరి అప్పటినుండి మాంసాహారం మానివేసి స్వామిని ఎంతో భక్తితో సేవించేది.

ఆయన ఒకసారి గుంటూరులో ప్రభుత్వ వైద్యశాలకు దగ్గరలోవున్న ములగచెట్టు క్రింద ధ్యానస్థులై కూర్చుని వున్నారు. అంతలో ఉరుములు, మెరుపులతో పెద్ద వర్ష మారంభమైంది. మస్తాన్‌గారు కదలలేదు. ఆయన చెంత నుండే మేక ఆ వానకు, చలికి తట్టుకోలేక కొద్ది దూరంలో అరుస్తున్నది. ఇంతలో దగ్గరలో పెద్ద పిడుగు పడడంతో ఆ మేక, కొద్ది దూరంలో వున్న ఒక మనిషి చనిపోయారు. వర్షం తగ్గాక చుట్టుప్రక్కల జనం ఆయనను చూడడానికి వచ్చారు. ఆయనచుట్టూ నేలపై ఒక్క చినుకైనా పడక పొడిగా వున్నది. వాళ్ళు ఆ చచ్చిన మేకను అవతలకు లాగిపారేద్దా మనుకుంటూంటే మస్తాన్ గారు కళ్ళు తెరచి దాని దగ్గరకెళ్ళి, దానిచుట్టూ మూడుసార్లు తిరిగి, “ఉఠో” అన్నారు. వెంటనే ఆ మేకలేచి, తన ఒంటిపైనున్న వర్షపునీరు విదిలిచుకొని చుట్టూవున్న జనాన్ని చూచి, భయంతో మస్తాన్‌గారి కాళ్ళసందున దూరింది. ఈ సంగతివిని, ఆ చనిపోయినవాని తల్లి వచ్చి ప్రార్థించగా మస్తాన్‌గారు ఆ శవం దగ్గరకెళ్ళి వానిని లేవదీసారు. వెంటనే అతడు నిద్రలేచినట్లు లేచి స్వామికి ప్రణమిల్లాడు.

శ్రీ శిరిడీ సాయబాబావలెనే వీరుగూడ ఖండయోగం చేసేవారు. ఒకసారి గుంటూరులోని నల్లపాడు వద్దనున్న పొలంలో వీరి కాళ్ళు, చేతులు, మొండెము ఖండించబడి తలా ఒకచోటా విసిరివేసినట్లు పడివున్నాయి. ఆ పొలం యజమాని చూచి కంగారుపడి పరుగున పోయి గ్రామస్థులకు ‘ఎవరో మస్తాన్ గారిని హత్య చేసా’ రని చెప్పాడు. వారక్కడకు వెళ్ళి చూచేసరికి మస్తాన్‌గారు మామూలుగా కూర్చునివున్నారు. విస్తుపోయియున్న పోలం యజమానిని చూచి చిరునవ్వుతో మస్తాన్ గారు, “భయపడ్డావా?” అన్నారు. ఈ మహిమకు అబ్బురపడిన ఆ గ్రామస్థులు వారిని తమ గ్రామానికి రమ్మన్నారు గాని, ఆయన అంగీకరించక గుంటూరు వెళ్ళిపోయారు.

కడపకు చెందిన మహమ్మదీయ వర్తకుడొకడు నల్లమస్తాన్‌గారికి గుంటూరు సంగడిగుంటలో ఒక యిల్లు కొనియిచ్చాడు. మస్తాన్ గారు, వారి ముఖ్య శిష్యునితో పాటు కొంతకాలం అందులో నివసించారు. ఇప్పటికీ మస్తాన్ గారి దర్గాకు కావలసిన పూజా ద్రవ్యాలు ఆ ఇంటి నుండే తీసుకువస్తారు.

మస్తాగారొకసారి ఒక దుకాణం ముందు కూర్చున్నారు. గోచీ పెట్టుకుని పిచ్చివానిలా వున్న ఆ వృద్ధుని చూచేసరికి అసహ్యమేసి ఆ వర్తకుడు ఆయనను వెళ్ళిపొమ్మని చెప్పాడు. ఆయన కదల్లేదు. ఆ వర్తకుడు కోపంతో ఆయనను కర్రతో కొట్టాడు. వెంటనే మస్తాన్ గారి శరీరం ముక్కలై, చెల్లాచెదురుగా పడిపోయింది. జనం పోగై పట్టరాని ఆగ్రహంతో పోలీసు రిపోర్టు యిచ్చారు. పోలీసులొచ్చి ఆ వర్తకుని జైల్లో పెట్టారు. తర్వాత ముక్కలైన మస్తాన్ గారి శరీరభాగాలను ఒకచోట చేర్చి అంత్యక్రియలు చేయడానికి తీసుకెళ్ళబోతుండగా ఆ ముక్కలన్నీ అతుక్కుని మస్తాన్ గారు లేచి కూర్చున్నారు!

ఈ విచిత్రమైన వార్త తెలిసి పోలీసు అధికారులు ఆ వర్తకుని విడుదల చేసారు.

ఎంతటి మహాత్ములనైనా కొందరు పిచ్చివారని భ్రమిస్తూనే వచ్చారు. అలానే ఒక మహమ్మదీయ యువకుడు మస్తాన్ గారు పిచ్చివాడని వాదించసాగాడు. ఆ మహాత్ముని అలా అనడం పాపమని ఎంతగా చెప్పినా వినక, అతడు మరింత మూర్ఖంగా, "ఆయన పిచ్చివాడు, పిచ్చివాడు, పిచ్చివాడు" అని గట్టిగా అరచాడు. అంతే! అతడి నోరు ఆగలేదు. అతడలా అరుస్తూ తిరగసాగాడు. అతడికి పిచ్చెక్కిందని మూడు రోజులు గదిలో బంధించారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది! విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అతనిని మస్తాన్‌గారి దగ్గరకు తీసుకెళ్ళి, అతనిని క్షమించి అనుగ్రహించమని ప్రార్థించారు. ఆయన కరుణించి అతని నోటిమీద తమ చేతిని పెట్టారు. వెంటనే అతడికా పిచ్చిధోరణి తగ్గి మతిస్థిమితం చేకూరింది. అతడు గూడా మస్తాన్‌గారి భక్తుడయ్యాడు.

విజయవాడలో కొందరు ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో మస్తాన్ గారు వచ్చి తమ చేతనున్న బుట్ట వారికిచ్చి, "నేనిప్పుడే మక్కాకు వెళ్ళొస్తాను. ఈ బుట్టను చూస్తుండ"మని చెప్పి వెళ్ళిపోయారు. ఆయనేదో తమాషాకలా అన్నారని వారనుకున్నారు. కాని మరికొంత సేపటికి మస్తాన్ గారొచ్చి బుట్ట తీసుకుంటూండగా ఒకరు హాస్యంగా, "ఏం మస్తాన్‌గారూ, మక్కా వెళ్ళొచ్చారా?" అనడిగారు. అందుకాయన తాము వెళ్ళొచ్చామనీ ఆక్కడారోజు పెద్ద ఉత్సవం జరుగుతున్నదనీ, ఎందరో మహాత్ములు గూడ వచ్చారనీ, వారిని దర్శించి తామిప్పుడే వస్తున్నామని చెప్పారు. వారాయన మాటలు నమ్మక మక్కాలోవున్న స్నేహితులకు జాబు వ్రాసి విచారించారు. అక్కడి మిత్రులు ఆ రోజు ఉత్సవం జరిగినట్లు, దానికి చాలామంది మహాత్ములు, గుంటూరు నల్లమస్తాన్ గారు గూడ వచ్చినట్లు తెలిపారు! ఆయన మహిమ నెరిగిన ప్రజలు విజయవాడలో ఆయనను పెద్ద ఉత్సవంతో ఊరేగించారు.

పోలూరు బాపిరాజనే మహాత్ములు తమ శిష్యుడు ఉన్నవ నందయ్యాగారితో మస్తాన్‌గారిని దర్శించమని చెప్పారు. వారు మస్తాన్‌గారి వద్దకెళ్ళేసరికి ఆయన ధ్యానంలో వున్నారు, చెంతనే ఒక పేద ముసలివాడు కూర్చుని వున్నాడు. కొంతసేపటికి మస్తాన్‌గారు కళ్ళు తెరచి ఆ వృద్ధుని మొరాలకించాడు. నందయ్యాగారితో ఆయన, "నీ దగ్గర నాలుగణాలున్నాయిగదా, యితనికివ్వు" అన్నారు. నిజంగా నందయ్యాగారివద్ద వున్నవి నాలుగణాలే. నందయ్యాగారు ఆనందంతో ఆ పైకం ఆ వృద్ధునికిచ్చి మస్తాన్ గారికి నమస్కరించారు. ఆయనేమీ చెప్పకముందే మస్తాన్‌గారు "నిన్ను బాపిరాజుగారు పంపారుగదా, ఆయనెంతో ఉత్తములు. మీ హిందువుల యిండ్లలో పితృదినాలలో యితరులెవరికీ భిక్షగూడ పెట్టరు. కాని బాపిరాజుగారు వారి తండ్రి శ్రాద్ధం రోజున నాకు ముందుగా అన్నం పెట్టారు!" అన్నారు. తమ గురువుగారి ఔన్నత్యానికీ, మస్తాన్ గారి సర్వజ్ఞత్వానికి ముగ్ధుడైనారు నందయ్యాగారు.

నైజాం రాష్ట్రంనుంచి 'మారుల్ ముస్తఫా ఖాదర్' అనే మత గురువు దేశసంచారము, శిష్య సేకరణ, ధన సేకరణ చేస్తూండేవాడు. ఆయన మస్తాన్ గారిని దూషిస్తూంటే కొందరాయనను మస్తాన్ గారి వద్దకు తీసుకొచ్చారు. నిరాడంబరుడు, మౌని, వృద్ధుడూ అయన మస్తాన్ గారిని చూచి ఖాదర్ విద్యాగర్వంతో అరబ్బీలో కొన్ని మంత్రాలు చదివి, వాటి అర్థం చెప్పమన్నాడు. అది తమకు తెలియదనీ, తెలియవలసిన అవసరంగూడ లేదనీ చెప్పారు మస్తాన్ గారు. ఖాదర్ ఆవేశంతో, "అయితే ఖురాన్ వ్యర్థమా? నువ్వు మహమ్మదీయుడవు గావా? కాఫిర్ (పాపి) వా?" అని గద్దించాడు. దానికి సమాధానం చెప్పక కండ్లు మూసుకుని ధ్యానస్థులైనారు మస్తాన్ గారు. అక్కడున్న భక్తులు, "మస్తాన్‌గారు దివ్యశక్తులుగల మహాయోగియని చెప్పారు. అపుడు ఖాదర్ మరీ క్రుద్ధుడై, "ఈ మహిమలు, యోగాలు వట్టి నటన; నిజమైన భక్తుడు ఖురాన్ వల్లించి, అందులోని ధర్మాలు పెద్దలవలన తెలుసుకుని ఆచరిస్తూ

దేశ సంచారము, మత ప్రచారమూ చేయాలి" అన్నాడు.

"భక్తి అంటే భగవంతునియందు అపారమైన ప్రేమ. భగవంతుడు సర్వవ్యాపి, సర్వ జీవులయందూ ప్రేమగలవాడూ గనుక భగవంతుని ప్రేమించడమంటే సకల జీవులనూ ప్రేమించడమే. అట్టి భక్తుడొక మతానికి ఎలా చెందుతాడు? అన్ని మతాలయందు సమభావముంచి స్వపరభేదముంచక స్వాభిమానరహితుడై విదేహునివలె మెలగుతూ, ఫలాభిమానం లేకుండా లోకోద్ధరణకోసం కర్మలాచరిస్తుంటాడు. కోపముతోగాక, ప్రశాంతంగా పరిశీలిస్తే ఈ మహాత్ముని సాధుత్వం మీకూ తెలుస్తుంది" అని ఒకరన్నారు. అంతట ఖాదర్ పట్టరాని ఆవేశంతో, "కాఫిరుల శాస్త్రాలతో మాకు పనిలేదు. మీతో మేము వాదించడానికి రాలేదు. ఈ మస్తాన్ గారు అంతటి మహాత్ముడే అయితే, విదేహుడే అయితే, మాకు దృష్టాంతము చూపిస్తాడా? చూపిస్తే మేమూ ఆయన శిష్యులమవుతాము. అలా కాకుంటే మీరంతా మా మతం స్వీకరించాలి?" అన్నాడు. అప్పుడొక హిందూ వృద్ధుడు 'సరే'నన్నాడు. అప్పుడు ఖాదర్‌గారు "నా పరీక్షవలన ఆయనకేం ప్రమాదం జరిగినా నేను జవాబుదారుడను గాను" అని చెప్పి, ఒక పెద్ద గంగాళంలో నూనెపోసి కాచి, మస్తాన్‌గారి ఒంటిపై పోశాడు. మస్తాన్‌గారు కదలకపోయేసరికి మరి మరింత పట్టుదలతో ఆ నూనెను యింకా మరగకాయించి మస్తాన్‌గారిపై ధారగా పోయసాగాడు. ఇంత జరుగుతున్నా మస్తాన్ గారిలో చలనంలేదు, సరిగదా, ఆయన శరీరం కొంచెంగూడ బొబ్బలెక్కడంగానీ, కందడంగానీ జరుగలేదు. ఈ అద్భుత లీలకు ఆశ్చర్యచకితుడైనారు ఖాదర్‌గారు. ఖాదర్‌గారి మనస్సు పూర్తిగా మారిపోయింది. మస్తాన్ గారు కండ్లు తెరిచాక అతడు పాదాక్రాంతుడై, తన తప్పు క్షమించి, శిష్యునిగా అంగీకరించమని ప్రార్థించాడు. మస్తాన్ గారు నవ్వుతూ అతనిపై కృపాదృష్టి సారించారు. తర్వాత ఖాదర్‌గారు స్వదేశానికి వెళ్ళి అక్కడ మస్తాన్‌గారి మహాత్మ్యం గురించి ప్రచారం చేసాడు.

మస్తాన్‌గారిని చాలామంది తమ గురువుగా భావించారుగాని ఎవరినీ ఆయన తన శిష్యులుగా తలచలేదు. వారికి ఆదేశాలివ్వలేదు. షేక్ మదార్ సాహెబ్ అను భక్తుడు తన చిన్నతనం నుంచీ విడువకుండా ఆయన సేవ చేస్తూ ఎప్పుడు ఆయన వెంటనే వుండేవాడు. అతనికి గూడ ఆయనెన్నడూ ఏ సాధనా విధించలేదు. వారి సాన్నిధ్యము వారి స్మరణలే సకల సాధనల సారం. ఆ సన్నిధి ప్రభావంలో ఎవరి పరిపాకానికి తగిన సాధన వారికి జరుగుతుంది. వారి నిత్యజీవిత మెంతవరకు సంస్కరింప బడుతుందో అంతమేరకు వారి సాధన ఫలిస్తుంది. అక్కడ నిర్బంధం వ్యర్థం.

షేక్ మదార్‌గారిది నెల్లూరు జిల్లా పాముూరు గ్రామం. మస్తాన్ గారు మహాసమాధి చెందేందుకు కొద్దిసం॥ల ముందు తిరగడం మానివేసినపుడు ఇతడు ఒక బండిలో ఆయనను కూర్చోబెట్టి ఆయన తీసుకెళ్ళమన్న చోటికల్లా తీసుకెళ్తూండేవాడు. ఇతడే మస్తాన్‌గారి జీవిత విశేషాలు చెబుతూండేవాడట. మస్తాన్‌గారి జీవితకాలంలో చరిత్రకెక్కని లీలలు యింకెన్ని వున్నాయో!

సుమారు 200 సం॥లపాటు యిలాంటి లీలలెన్నో చేసిన గుంటూరు నల్లమస్తాన్ సాహెబ్ గారు 1885వ సం॥ మే 23న సిద్ధిపొందారు. ఆరోజున ఆయన చుట్టుప్రక్కల గ్రామాల వాళ్ళకు సామాన్యునిలా కన్పించి. "ఈ రోజు నల్లమస్తాన్ సాహెబ్ సిద్ధిపొందారు. గుంటూరులో పెద్ద ఉత్సవం జరుగుతోంది; అది చూడడానికి వెళ్తున్నాను" అని చెప్పారు. వారందరికీ ఒకే రూపంలో దర్శనమిచ్చినట్లు తర్వాత తెలిసింది!

అలానే వినుకొండ వాస్తవ్యురాలైన ఒకామె ఎంత కాలానికి సంతానంలేక మస్తాన్ గారిని ఆశ్రయించింది. ఆయన అనుగ్రహంతో ఆమెకొక మగబిడ్డ కలిగాడు. ఆ పిల్లవానిని మస్తాన్‌గారికి చూపించాలని ఒకనాడామె వినుకొండ రైల్వే స్టేషను కొచ్చింది. అక్కడొకమూల మస్తాన్ గారు కూర్చుని వున్నారు! ఆమె పరుగునపోయి పిల్లవానిని ఆయన కాళ్ళమీద పడేసింది. ఆయన బిడ్డనాశీర్వదించి ఆమెతో, "నువ్వు గుంటూరు వెళ్ళు, అక్కడ పెద్ద వుత్సవం జరుగుతోంది!" అన్నారు. ఆమె గుంటూరు చేరేసరికి అక్కడ

మస్తాన్‌గారు సమాధిచెందారని తెలిసింది. భక్తులు గొప్ప ఉత్సవం చేస్తున్నారు. కాని అంతకు 2 గం॥ల క్రితమే తాను ప్రత్యక్షంగా చూచిన ఆయన సమాధి చెందారంటే ఆమె నమ్మలేకపోయింది. కాని సమాధిచెందిన దేహం గూడ ఆయనదే! అయితే తాను చూచినవారు స్వామిని పోలిన మరొకరేమోనని అనుమానంతో వినుకొండ వెళ్ళి విచారించగా అక్కడ అలాంటి వ్యక్తిని మరెవరూ చూడలేదని తెలిసింది!

శ్రీ మస్తాన్ గారు సమాధిచెందడానికి 5 రోజులు ముందుగానే తాము మే 23వ తేదీ పగలు 10 గం॥లకు సమాధి చెందబోతున్నామని భక్తులకు తెలియజేసారు. అందువల్ల వేలాది జనం ఆయన దర్శనార్థమొచ్చారు. ఆ రోజు 10గం॥ల వరకూ గూడ ఆయన మామూలుగానే వున్నారు. సరిగా 10గం॥లకు తన ప్రియశిష్యుడైన మదార్ సాహెబ్ తో తాము వెళ్ళిపోతున్నామని చేతితో సైగచేసి వెంటనే సిద్ధిపొందారు.

ఈ వార్త క్షణాలమీద పట్టణమంతా పాకిపోయింది. మస్తాన్ గారి దేహాన్ని ముస్లిం మతానుసారం సమాధి చేయాలని నిర్ణయించారు. సమాధికిగాను నగరం పిచ్చెయ్యగారు కొంత స్థలమిచ్చారు. కాని పట్టణానికి దగ్గరలో సమాధి వుండడం ప్రజల ఆరోగ్యానికి భంగమనీ, మామూలు స్మశానంలోనే పూడ్చివేయాలనీ ఆరోగ్యశాఖాధికారి చెప్పాడు. కాని భక్తులు అంగీకరించలేదు. ఏమి చేయాలో తోచక కార్యకర్తలు తర్జన భర్జనలు జరుపుతున్నారు. ఇంతలో ఆరోగ్యశాఖాధికారికి కడుపునొప్పి ప్రారంభమై క్షణక్షణానికి తీవ్రమైంది. అపుడు 'గిల్' అనే దొర అతని పరిస్థితి గ్రహించి దానికి కారణం మస్తాన్ గారి సమాధికి అడ్డుచెప్పడమేనని హెచ్చరించాడు. వెంటనే అతడు తన అభ్యంతరం ఉపసంహరించుకుని మస్తాన్ గారికి క్షమాపణ చెప్పుకున్నాడు. తక్షణమే ఆయన కడుపునొప్పి తగ్గిపోయింది. భక్తులు పట్టరాని ఆనందంతో ఈ కార్యక్రమమారంభించి శ్రీమస్తాన్ గారి దివ్యదేహాన్ని అక్కడే సమాధి చేసారు. సమాధి చెందినప్పటికీ భక్తులకాయన తమ దివ్యలీలలు ప్రదర్శిస్తూనే వున్నారు. ప్రతి సంవత్సరమూ ఆయన ఉరుసు ఉత్సవం మహావైభవంగా జరుగుతుంది. ఆయన సమాధి చెందిన పవిత్రదినాన సకల సాధుస్వరూపియైన సాయినాథుడు మనందరినీ మస్తాన్‌గారి రూపంలో గూడ అనుగ్రహించుగాక! ●

## సాధనకి తత్త్వజ్ఞానం ఎంతో అవసరం

05వ పేజీ తరువాయి

తక్కిన వేదాంత తర్కవచనములచేతను, నానావిధ శాస్త్రసమూహములచేతను, ధ్యానాది సత్కర్మములచేతను యోగము తెలియదగినదిగాదు.

సురేశ్వరాచార్యుడు. "గురుప్రసాదము వలన అష్టాంగసహిత యోగమును పొందుచున్నానని" చెప్పాడు. "ఆచార్యవాన్ పురుషోవేద" అని ఛాన్దోగ్యము – గురువును ఆశ్రయించినవాడే పురుషుని (దైవాన్ని) చేరుకుంటాడని చెప్పింది.

ఇలా అనడానికి "హఠయోగప్రదీపిక" లోని యమనియమాదులనుదహరిస్తూ శ్రీ బ్రహ్మానంద సరస్వతి వ్రాసిన యీ వాక్యాలు ప్రమాణం. "దేహేంద్రియముల వలన కల్గు వైరాగ్యము యమము, పరతత్త్వమునందెడదెగక కల్గు అభిలాష నియమం. సర్వవస్తువులయందు ఉదాసీనత ఉత్తమమైన ఆసనం. సకల జగత్తూ మిథ్యగాదోచుట ప్రాణాయామము. చిత్తముయొక్క నిశ్చయస్థితి ధారణ. చిన్మాత్రమే నేనని చింతించుట ధ్యానము. ధ్యానానికతీతమైన స్థితిలో ధ్యానాన్ని మరవడం సమాధి".

ఇలాంటి నిశ్చయాన్ని 'విజ్ఞానవీచికలు', 'మతంఎందుకు?', 'శ్రీసాయినాథ ప్రభోధామృతము' ఎంతో చక్కగా చేకూరుస్తాయని కొంచెం జాగ్రత్తగా ఆ గ్రంథాలను పరిశీలిస్తే ఎవరికైనా తెలుస్తుంది. ●

# మాతృదేవి స్మృతులు

***శ్రీమతి సుధారాణి, ఒంగోలు***

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యురాలు శ్రీమతి సుధారాణిగారు ఈవిధంగా తెలియజేస్తున్నారు.

నేను మొట్టమొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని ఒంగోలులో దర్శించుకున్నాను. అప్పుడు వారు హైదరాబాదునుంచి వచ్చి కొన్నిరోజులు ఒంగోలులో వుండి మళ్ళీ వెళ్లిపోయారు. అప్పుడు ప్రతిరోజూ సాయంత్రం పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం వుండేది. అంతకుముందు నేను బాబా చరిత్ర పారాయణ చేసేదాన్ని. నాకు బాబా తరచుగా స్వప్న దర్శనమిచ్చేవారు. ఒకసారి ఒక అనుభవం ఇచ్చారు. నాకు కొంచెం భయం వేసి, 'నేను ఇలాంటి అనుభవాలు తట్టుకోలేను, దయచేసి స్వప్నదర్శనాలు వద్ద'ని బాబాను ప్రార్థించాను. అప్పటినుంచి చాలా సంవత్సరాలు స్వప్నదర్శనమివ్వలేదు. అందుకు చాలా బాధపడేదాన్ని. తరువాత కొన్ని కారణాలవల్ల వ్యాపకాలు ఎక్కువై, 'పారాయణ మానేస్తే బాబా ఎక్కడ వదిలేస్తాడో'నన్న భయంవల్ల, చేశానన్న పేరుకి పారాయణ చేసేదాన్ని.

పూజ్యశ్రీఅమ్మగారినిమొదటిసారిదర్శించినప్పుడు నేను వారితో, "ఈమధ్య బాబా స్వప్నదర్శనం ఇవ్వటం లేదమ్మా! ఇదివరకు బాగా ఇచ్చేవారు", అని చెప్పాను. వెంటనే పూజ్యశ్రీ అమ్మగారు కొంచెం గంభీరంగా మొహం పెట్టి,"నువ్వు శ్రద్ధగా పారాయణ చేస్తే కదా, స్వప్నదర్శనం ఇవ్వడానికి!" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను – నా నిజస్వరూపం అంతా తెలిసిపోయిందని! నా దగ్గర వున్న శ్రీసాయిలీలామృతం గ్రంథం పూజ్యశ్రీ అమ్మగారికిచ్చి, "మీ ఆశీస్సులు వ్రాసి ఇవ్వండమ్మా!" అని ప్రార్థిస్తే, ఏదైనా ఇంకో కొత్త గ్రంథం తెచ్చుకోమన్నారు. అప్పుడు ఆఫీసులో 'ప్రబోధామృతం' గ్రంథం వున్నదని ఇచ్చారు. దానిలో ఆశీస్సులు వ్రాసిచ్చారు. తరవాతనుంచి పారాయణ బాగా జరిగేది. బాబా మళ్ళీ నన్ను కరుణించడం మొదలుపెట్టారు. అన్నింటికన్నా ముఖ్యంగా నేనున్న ప్రదేశంనుంచి ఇల్లుకట్టుకుని కర్నూలురోడ్డుకి వచ్చాము. పక్కనే బాబా గుడి వుంది. **పూజ్యశ్రీ అమ్మగారికి ఒక్కమాట చెప్పుకున్నందుకు పరిస్థితులన్నీ మార్చేశారు.**

పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలన్నీ పారాయణ చేయడము నాకెంతో ఇష్టం. ఈమధ్య శ్రీ గురుచరిత్ర పారాయణ బాగా జరగడంలేదని బాధపడుతూ వున్నాను. ఒకరోజు స్వప్నంలో పూజ్యశ్రీ అమ్మగారు నాకు తమ పవిత్రస్పర్శని అనుగ్రహించారు. తరవాతనుంచి పారాయణ బాగా జరుగుతోంది.

పూజ్యశ్రీ అమ్మగారు సమాధిచెందినపుడు నాకు గుమ్మళంపాడు వెళ్లాలని, కనీసం పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో పూజ్యశ్రీ అమ్మగారికి జరిగే

మంగళస్నానంలోనైనా పాల్గొనాలని చాలా ఆశపడ్డాను. కానీ ఇంట్లో అనుమతి లభించలేదు. కానీ అనూహ్యంగా మన సత్సంగసభ్యుల ద్వారా పూజ్యశ్రీ అమ్మగారి మంగళస్నానాల తీర్థం నాకు లభించింది!

అలాగే పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని పసుపు, కుంకుమ మొదలైనవాటితో భక్తులందరూ నింపుతున్నారు. నేను వెళ్లలేకపోయానని బాధపడుతున్నాను. తరవాత ఒకరోజున ఒక గురుబంధువు మా ఇంటికి వచ్చి పూజ్యశ్రీ అమ్మగారిని సమాధి చేసిన రోజున అకస్మాత్తుగా మీరు గుర్తుకువచ్చి, మీ ఇంట్లో అందరి పేర్లు చెప్తూ పసుపు, కుంకుమ సమర్పించానని చెప్పాడు! పూజ్యశ్రీ అమ్మగారి కృపకు ఆనందభాష్పాలు వచ్చాయి.

అలాగే ఒంగోలు సత్సంగసభ్యులకు ఒకరోజున నివేదన తయారుచేసి గుమ్మళంపాడులో పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించే మహాభాగ్యం కలిగింది. అప్పుడు కూడా నాకు ఆ అవకాశం లేకుండాపోయింది. అయితే పూజ్యశ్రీ అమ్మగారి దయ.. మన సత్సంగసభ్యులు భిక్ష సమర్పించుకుంటుంటే, కొన్ని పదార్థాలు నేను ఇంట్లో తయారుచేసి సమర్పించుకునే అవకాశం రెండు మూడు సార్లు దొరికింది! నా పరిస్థితి ఎలా వున్నా ఇవన్నీ పూజ్యశ్రీ అమ్మగారు నాకు కల్పించిన అవకాశాలు.

పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందాక ఎలాగో వీలుచూసుకుని రెండుమూడుసార్లు గుమ్మళంపాడుకు దర్శనానికి వెళ్లాను. కొన్ని నెలల క్రితం మా అబ్బాయి పెళ్లికోసం పారాయణ చేస్తున్నాను. ఒక సంబంధం వచ్చింది. అది కుదురుతుందనుకుంటే వాళ్ళే విరమించుకున్నారు. ఆ సమయంలో గుమ్మళంపాడుకు వచ్చాను. ఆరోజు ఏదో విశేషమైన కార్యక్రమం జరుగుతోంది. నేను శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్రతో పాటు ఒక మహాత్ముని చరిత్ర కూడా చదువుతాను. అప్పుడు శ్రీ రామిరెడ్డి తాత చరిత్ర పారాయణ చేస్తున్నాను.

మా అబ్బాయి వివాహం గురించి చాలా వ్యాకులతతో వున్నాను. పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకుంటూ, 'అమ్మా నేనిప్పుడు చదివే పారాయణలో మా అబ్బాయి వివాహానికి సంబంధించిన సూచన తెలియచేయండి!' అని మొక్కుకుని, అక్కడే కూర్చుని శ్రీ రామిరెడ్డితాత గ్రంథం తీశాను. నేను తీసిన పేజీలో సూటిగా, 'ముందు అనుకున్నదే జరుగుతుంది!' అన్న వాక్యం వుంది!! నిజానికి ముందు అనుకున్న పెళ్ళివారు విరమించుకున్నాక, ఇప్పుడు అనుకున్న సంబంధం వాళ్ళు మాకు అనుకూలంగా జవాబు ఇస్తారని ఎదురు చూస్తున్నాము. కానీ పూజ్యశ్రీ అమ్మగారు ముందు అనుకున్నది జరుగుతుందని సూచన చేశారు. 'అదెలా జరుగుతుందా?' అనుకున్నాను. కాసేపట్లో గుమ్మళంపాడులో వుండగానే, మొదట అనుకున్నవాళ్ళు ఫోన్ చేసి సమ్మతి తెలియచేయడం జరిగింది. తరవాత రెండవ సంబంధంవాళ్ళు విరమించుకుంటున్నట్లు తెలియచేశారు. అది సమాధి కాదు, పూజ్యశ్రీ అమ్మగారి సజీవ రూపం!!

చాలారోజులపాటు బాబా గుడికి వెళ్లే అవకాశం లేనప్పుడు చాలా బాధగా వుంటుంది. అలా బాధపడినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నా పరిస్థితులలో మార్పు తెచ్చి, నాకు వారి దగ్గరకి వెళ్లే అవకాశం కల్పిస్తారు! పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి చాలా దూరం కనుక ఆశపడే అవకాశం కూడా వుండదు. కానీ ఆ తల్లి దయవల్ల, అది కూడా అప్పుడప్పుడూ జరుగుతోంది. వారి దయాధర్మాలమీదే ఆధారపడివున్నానన్న సంగతి నాకు బాగా అనుభవమౌతూవుంటుంది. 'సృష్టిస్థితులు తమ అధీనంలో వుంచుకున్న వారి ఆధీనంలో వున్న మనకు ఏం లోటు?' అనిపిస్తుంది.

వారి కృపావర్షం నామీద ఎల్లకాలం ఇలాగే వర్షించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, పాదాభివందనాలర్పిస్తూ ప్రార్థిస్తున్నాను. ●

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 15వ ప్రసంగము

### అంధత్వాన్ని పోగొట్టుకోవడానికి దారిద్ర్యము అంజనము (కాటుక)

స్వా॥ప్ర॥ : ధనానికి, దైవభక్తికి స్నేహం లేదు. ధనము మానవుడిని దుష్ప్రవర్తన వైపుకు మళ్ళిస్తుంది ఎక్కువ ధనము అవినీతి వలననే లభిస్తుంది. గొప్ప గొప్ప ధనవంతులందరూ వేలకొద్దీ దరిద్రులను బాధించి, వ్యాపారంలో కల్తీ, మోసం చేసి, నౌకరులకు పూర్తిగా జీతాలు యివ్వకుండా, అన్యాయంగా ధనం సంపాదించి ధనవంతులవుతున్నారు. అటువంటి వారికి ధర్మము – అధర్మము తెలిపే వివేక రూపమైన నేత్రం వుండదు. కాబట్టి వారు అధర్మ మార్గంలోనే నడుస్తారు. అటువంటి వారి గురించే శంకరాచార్యులవారు యిలా అన్నారు:

**శ్లో॥**

**సంపన్నోంధవదేవ కించిదపరం నో వీక్షతే చక్షుషా।**
**సద్భిర్వర్జిత మార్గమేవ చరతి ప్రోత్సాహితో బాలిశైః॥**
**తస్మిన్నేవ ముహుః స్ఖలన్ ప్రతిపదం గత్వాంధకూపే పత।**
**త్యస్యాంధత్వనివర్తకౌషధమిదం దారిద్ర్యమేవాంజనమ్॥**

భావం: ధనవంతుడు గుడ్డివాడి లాగా కళ్ళతో దేనిని చూడడు. బుద్ధిలేని వారి ప్రోత్సాహంతో సన్మార్గులు విడిచిన మార్గంలోనే సంచరిస్తాడు. దానిపైననే నడిచి మాటిమాటికి దెబ్బలు తిని చివరికి చీకటి బావిలో పడతాడు. వాడి అంధత్వాన్ని పోగొట్టే మందు దారిద్ర్యమనే అంజనమే.

గుడ్డివాడు ఏ పదార్థాన్ని చూడలేడు. అలాగే ధనవంతుడు ఈ ప్రపంచం ఏమిటి? ఇక్కడికి వచ్చి ఏమి చేయాలి? ప్రపంచంలో దుఃఖపడే వాడెవడు? సుఖపడే వాడెవడు? ధనాన్ని ఎలా ఉపయోగించాలి? దరిద్రుల పట్ల ధనవంతుల ధర్మం ఏమిటి? మొదలైన విషయాలను ఆలోచించడు. ఎలాగూ ఎటువంటి వివేకము కూడా వుండకపోవడం వలన మూర్ఖులకు కూడా అతడు "మీ దగ్గర వున్న ధనాన్ని ఎందుకు పడితే అందుకు ఖర్చు పెట్టకూడదు. మీకోసమే ఉపయోగించాలి. సుఖాలను, భోగాలను అనుభవించండి. అది తప్ప ఈ ప్రపంచంలో యింకేముంది?" ఇటువంటి ఉపదేశాలచేత(సూచనలచేత) సత్పురుషులు విడిచివేసిన (విసర్జించిన) తప్పుదారిలోకే అందరినీ తోస్తారు ఆ తప్పుడు దారిలోనే దెబ్బలు తింటూ, తమ గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగించే పనులను చేస్తూ ఆపదలలో చిక్కుకుంటారు.

ఈ లోకంలోనూ, పరలోకంలోనూ దుఃఖం కలిగించే

అధర్మమనే బావిలో పడిపోతారు. ఆ అంధత్వాన్ని పోగొట్టడానికి దారిద్ర్యమనే అంజనమే ఉత్తమమైన ఔషధము.

ఈ దారిద్ర్యంలో సామాన్య ప్రజలు తమ ధనం లేని పరిస్థితికి దుఃఖపడతారు. 'నేను బాధపడుతున్నాను, దరిద్రుడని దిక్కులేని వాడిని' – అని దైన్యంతో దుఃఖాన్ని ఆహ్వానిస్తారు. దారిద్ర్యాన్ని తమంతట తామే స్వీకరించిన మహాపురుషులు మహారాజులను, శ్రీమంతులను దరిద్రులుగా తలుస్తారు. వారి కంటే తామే ఎక్కువ సుఖాన్ని, సంతోషాన్ని అనుభవిస్తారు. వారి దృష్టిలో ధనము, మట్టి సమానంగా వుంటాయి. నిష్కాములవ్వడం వలన వారు ఎటువంటి ఆశను కలిగివుండరు. పూర్వకాలపు ఋషులు సమర్థులవడం చేత ధనంలేని పరిస్థితిలోనే వుండేవారు. అందులోనే వారికి సంతోషం కలిగేది. వారు బ్రహ్మత్వాన్నే కోరేవారు. ఆ బ్రహ్మత్వం ఎదుట ఇంద్రవైభవం గాని, కుబేర సంపత్తి గాని వారికి తుచ్ఛమైనవే!

ఒక రోజున కబీరు దర్శనానికి ఒక సత్పురుషుడైన మహాపురుషుడు వచ్చాడు. ఆ సమయంలో కబీరు బట్టలు నేస్తున్నాడు. కబీరు యిలా శ్రమ పడుతుండడం, వారి ఇంటి పరిస్థితి అతిసాధారణంగా, నిరాడంబరంగా వుండటం చూసి ఆయనిలా భావించాడు – "ఈయన జీవితం గడుపుకోవడానికి అవసరమైన ధన సహాయం చేస్తే బ్రతికివున్నంతకాలం దేవుని స్మరిస్తాడు." ఇలా తలచి కబీరుతో యిలా అన్నాడు: "ఇంట్లో కొంచెం రాగి వుంటే యిస్తారా?"

కబీరు : రాగి తీసుకురావడానికి నా దగ్గర ధనం లేదు. ఇంట్లో ఒక రాగి పాత్ర మాత్రం వున్నది తీసుకోండి!

– అని కబీరు ఆ పాత్రను తీసుకొచ్చి యిచ్చాడు. ఆ మహాపురుషుడు అడవిలోకి వెళ్లి మూలికల సహాయంతో ఆ రాగి పాత్రను రెండు మూడు రోజులలో బంగారు పాత్రగా మార్చాడు. అది కబీరుకు సమర్పిస్తూ యిలా అన్నాడు – "దీనితో కావలసిన పదార్థాలను కొనుక్కోండి. ఇంకా రాగి తెచ్చిస్తే, ఇంకా బంగారాన్ని చేసి యిస్తాను. దీనివలన తమకు దైవభక్తికి చాలా సమయం మిగులుతుంది."

ఇది విని కబీరు నవ్వుతూ యిలా అన్నాడు – "మహానుభావా! ఇలా బంగారం చేయడం నాకు కూడా తెలుసు. కానీ యిలా బంగారం చేసుకొని దానితో జీవించడం మనకు ధర్మం కాదు. నాకు దైవభక్తిలో తప్ప మరెటువంటి ప్రక్రియలోనూ యిష్టం లేదు. ఇటువంటి ప్రక్రియలలో పడినట్లయితే నేను దైవానికి దూరమవుతాను". ఇలా చెప్పి మరొక రాగి పాత్రను తెచ్చి క్షణంలో ఆ సత్పురుషుడు చూస్తుండగానే బంగారు పాత్రగా మార్చి ఆయన ఎదుటి పెట్టి "నేను చేసే పనులన్నీ భగవంతుని చరణాలందే సమర్పితం కావాలి" అన్నాడు. అది చూచి ఆ సత్పురుషుడు సిగ్గుపడ్డాడు.

## బైబిల్ లో చెప్పబడ్డ ధన నిషేధము

బైబిల్ లో కూడా యిలా వుంది:

ఒక ధనవంతుడు జీసస్ దగ్గరకు వచ్చి యిలా అన్నాడు – "ఓ ఉత్తమోపదేశకుడా! అనంత జీవితాన్ని పొందడానికి నేనేమి చేయాలి?"

జీససు : నీవు నన్ను ఉత్తముడిగా భావిస్తున్నావా? దేవుడు తప్ప మరెవ్వరు ఉత్తములు కారు. నీకు దేవుడి ఉపదేశాలు తెలుసు కదా! వ్యభిచరించకు. హత్యలు చేయకు. దొంగతనం చేయకు. అబద్ధపు సాక్ష్యం చెప్పకు. నీ తల్లిదండ్రులను గౌరవించు.

ధనవంతుడు : ఇవన్నీ నేను చిన్నతనం నుండే చేస్తున్నాను.

అది విని జీససు అతనితో ఇలా అన్నాడు–

జీసస్ : అయితే ఇంకా ఒక లోపం వుంది. నీ ధనాన్నంతా పేదవారికి పంచేసి నాతో కూడా రా! దేవుడి రాజ్యంలో ప్రవేశించడమంటే సూది బెజ్జంలోనుంచి ఒంటెను పోనివ్వడం లాంటిది.

## ధనము వలన కలిగే బాధలు

పారస భాగంలో ధనము చేత కలుగు బాధలు వివరింపబడ్డాయి – "ధనము వుండగా విరక్తి కలగడం కష్టం. మనసు అసలే చంచలమైనది. ధనము లభించడంతోనే భోగాలు – అంటే పాపకృత్యాలు సులభంగా చేయడం సాధ్యం. అప్పుడు బుద్ధి నశిస్తుంది. వివేకముంటే పాపభీతి వలన రక్షణ పొందుతాడు. కానీ అన్నపానాదులు,

వస్త్రాలంకారాలు మొదలైన వాటిని విడిచిపెట్టలేదు. సంపదలో నియంత్రణ (సంయమము), వైరాగ్యము మహాదుర్లభము. సంపదలో భోగాల ప్రాబల్యం ఎక్కువగా వుంటుంది. సంసారమే స్వర్గమని తలచి పరలోకము పట్ల విముఖత కలుగుతుంది. ఇలా ఆ రజోగుణ బీజం నుండి తమోగుణ వృత్తి జన్మిస్తుంది. ధనవంతుడు ఒకవేళ పాపాల నుండి విముక్తి పొందినా, ఎల్లప్పుడూ వైరాగ్యంలో వుండి వివేకంతో ధనాన్ని ఖర్చుపెడుతున్నాకూడా, ధనాన్ని రక్షించుకోవడంలో నిమగ్నుడౌతాడు. భజన గాని, అభ్యాసము గాని(సాధన గాని) చేయడు. నీటిలో వుంటూ తడి అంటకుండా వుండటం అసంభవం. కాబట్టి సత్పురుషులు వివేకంతో జీవిత నిర్వహణకు అవసరమైన నిష్కల్మషమైన ధన సంపాదన అమృతం వంటిదని, అందుకు సందేహం లేదని నిర్ధారించారు. ఆహారము, వస్త్రాలు, ఉనికి ధనము వలననే లభిస్తాయి. కాబట్టి శరీర నిర్వహణకు అవసరమైన ధనాన్ని మాత్రమే సంపాదించాలి.

## నిజమైన నిర్ధనత్వం (ధనం లేకుండడం) పరమవైరాగ్యము

ఉదారులైన శ్రీమంతుల కంటే సంతోషశీలుడైన పేదవాడు ఉత్తముడు. ఎందుకంటే అతడు మాయ నుండి విరక్తి చెంది దేవుని పట్ల ఎక్కువ ప్రేమ కలిగి వుంటాడు. మృత్యు సమయంలో పేదవాడికి మాయామోహమైన పదార్థాల పట్ల ఆసక్తి వుండదు. భగవంతుని యందు భక్తి కలుగుతుంది. ధనవంతుడు ఉదారుడైనా, సాత్వికుడైనా, అనేక విధాలైన సుఖాలను అనుభవించడం వలన అతని ఆసక్తి మాయ నుండి మరలదు. అతిథుల కోసం ధనాన్ని వ్యయం చేస్తూ కోరికలు లేనివాడిగా వుండే ధనవంతుడు ఉత్తముడని చెప్పవచ్చు. కానీ అలా వుండడం సులభమైనట్లయితే కొంతమంది మహాత్ములు, మహారాజులు రాజ్యాలను ఎందుకు త్యజియిస్తారు? సత్యాసత్యాలు రెండింటి పట్ల ఒకేసారి ప్రేమ కలుగదు. ధనం లేకుండడమే అన్ని విధాల ఉత్తమమైనది. నిర్ధనత్వం (ధనం లేకుండడం) సాఫల్యం పొందగానే అతడు అన్నివేళలా సంతోషంగా వుంటాడు. తన బాధలను ఇతరుల దగ్గర వెల్లడించడు. భగవంతుడు తనకు అత్యంత యిష్టమైన వాడికి నిర్ధనత్వాన్ని కలుగజేస్తాడని భావిస్తాడు. సంతుష్టుడైన నిర్ధనునినే భగవంతుడు ఎక్కువగా ప్రేమిస్తాడు. కాబట్టి మహాత్ములైన తమ భక్తులతో అతడు ఇలా చెప్పాడు– "నీవు నిర్ధనుడివై పరలోకానికి వెళ్ళు!" నిజమైన నిర్ధనత్వం అంటే తన దగ్గర వున్న ధనాన్ని. సత్కార్యాలలో ఖర్చు చేసి నిర్ధనుడవడం. అదే పరమ వైరాగ్యము.

జయంతీ : అటువంటి వైరాగ్యము తమ వంటి త్యాగులకు లభిస్తుంది. నేను సంసారం వున్నవాడిని. డబ్బు లేనిదే రోజు గడవదు. శాస్త్రాలలో ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే పురుషార్థాలు చెప్పబడి వున్నాయి. ధనము లేనిదే ధర్మకార్యాలు ఎలా జరుగుతాయి? కర్మకాండలో యజ్ఞము, దానము, తపస్సు చెప్పబడ్డాయి. వాటిలో యజ్ఞము, దానము ధర్మము లేనిదే జరుగవు కదా?

స్వా॥ప్ర॥ : నచికేతుడు యమునితో **న విత్తేన త్వరణీయో మనుష్యః** అని చెప్పాడు. అంటే ధనం ద్వారా ఏ మానవుడు తృప్తిని పొందడు అని అర్థం

సికిందర్* చక్రవర్తి తన రాజ్యంలో వున్న ప్రజలందరి దగ్గర వున్న ధనాన్నంతా లాక్కున్నాడు. ఇంకా ఎవరి దగ్గరైనా ధనము వున్నదేమో తెలుసుకోవాలని అతడికి తోచింది. ఆ ఉద్దేశ్యంతో అతడు ఒక ఒంటెను ఒక డబ్బు# చొప్పున అమ్ముతానని రాజ్యమంతా దండోరా వేయించాడు.

ప్రజలకు ఒంటెను కొనాలనిపించింది. కానీ వారి దగ్గర ధనం లేకపోవడం వలన ఎవరూ కొనలేకపోయారు. ఒక పిల్లవాడు ఒంటెను కొనుక్కోవడానికి సరదాపడి తన తల్లిని ఒంటెను కొనుక్కోవడానికి ఒక డబ్బును యివ్వమని కోరాడు. తల్లి "నా దగ్గర డబ్బులు లేవు. నీకు ఒంటెను కొనుక్కోవాలనివుంటే నీ తండ్రి సమాధిలో ఒక డబ్బు పారవేయబడివున్నది. దానిని త్రవ్వి తీసుకో" అన్నది. ఆ పిల్లవాడు అలానే చేసి ఒంటెను కొనడానికి వెళ్ళాడు. సికిందరు ప్రశ్నించగా సమాధి నుంచి త్రవ్వి తీసుకొచ్చినట్లు

***మిగతా 25వ పేజీలో***

*సికందర్. – అలెగ్జాండర్ కు మరో పేరు. # ఒక డబ్బు– ధనానికి ఒక ప్రమాణము– ఒక రూపాయి లాగా.

# బుద్ధ ధ్యాన హృదయము

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## అధ్యాయం - 4

### మనస్సంస్కరణము - హృదయ సంస్కరణము

ఒక వ్యక్తికి, సాటి మనుషులకు మధ్య వుండే సంబంధాలను నియమించవలసిన 'నీతి' అనేది కొన్ని సూత్రాలు, నియమాలు, చట్టములు చేత బలపరచబడి, రక్షింపబడవలసి వుంటుంది. అంతేకాక తాత్వికంగాను, ప్రయోజనాత్మకంగాను దానిని సహేతుకంగ వివరించవలసి వుంటుంది. అయినప్పటికి నీతి యొక్క మూలం నిజమైన హృదయ సంస్కరణలోనే వుంటుంది. దీనికి బౌద్ధంలో యెంతో ప్రాధాన్యత వున్నది. సంపూర్ణంగా సంస్కరించబడిన హృదయం యొక్క నాలుగు స్థితులను బుద్ధుడిలా చెప్పాడు. ప్రేమతో కూడిన దయ (లేక మైత్రి), కరుణ, సహృదయమైన సంతోషం, సమ్మత (Equanimity); నిస్వార్థము, అనంతమైన ప్రేమ అన్నది తక్కిన మూడు లక్షణాలకు ఆధారం. మనస్సును పవిత్రంచేసే యత్నానికి కూడ అదే ఆధారం. అందుకే స్మృత్యుపస్థాన పద్ధతిలో మనోవాక్కాయలతో చేసే క్రియలు మైత్రీ భావాన్ని భగ్నంచేసేవి కాకుండా వుండే లాగ చూచుకోవటం స్మృతియొక్క లక్ష్యం. ఈ మైత్రి సాధనా మార్గంలో శిష్యుడు యీ మైత్రి భావాన్ని పెంపొందించుకోకుండా యెప్పుడూ వుండరాదు. "మైత్రి యందు స్మృతిని కలిగి వుండవలసినది" అని చెప్తుంది 'మైత్రి సూత్రం'. మైత్రికి, స్మృత్యుపస్థానానికి గల సంబంధాన్ని బుద్ధుడిలా చెప్పాడు. "నన్ను నేను రక్షించు కొందునుగాక" అన్న తలంపుతో స్మృత్యుపస్థానాన్ని అభ్యసించాలి. "నేను యితరులను రక్షించుదునుగాక" అన్న తలంపుతో స్మృత్యుపస్థానాన్ని అభ్యసించాలి. తనను తాను రక్షించుకోవడం ద్వారా యితరులను రక్షిస్తాడు. ఇతరులను రక్షించడం ద్వారా తనను తాను రక్షించుకుంటాడు. తనను తాను రక్షించుకోవడం ద్వారా యితరులను రక్షించడమెలా? తిరిగి తిరిగి స్మృతిని అభ్యసించడం ద్వారా, ధ్యానంలో సాధించిన అభివృద్ధి ద్వారా తరచుగా అందులో నిమగ్నుడవటం వలన, ఇతరులను రక్షించడం ద్వారా తనను తాను రక్షించుకోవడం యెలా? ఓరిమి, అహింస, మైత్రి, కరుణల ద్వారా (సంయుక్తనికాయము).

**ఆత్మోద్ధరణ** : స్మృత్యుపస్థానము ఆత్మోద్ధరణకు కావలసిన సందేశము. నిజానికి ఆత్మోద్ధరణయే నిజమైన సహకారము. అవసరమైనపుడు వ్యక్తికి యితరుల సహకారము, ఉపదేశము, సలహా, సానుభూతి, ఔదార్యము ముఖ్యమే అయినప్పటికి తనకు తాను సహాయపడినపుడే అంటే వాటిని హృదయ పూర్వకంగా అంగీకరించి వినియోగించుకోగలిగినప్పుడే అవి వినియోగపడుతాయి. "కృషి నీవే చేయాలి మహనీయులు మార్గం చెబుతారు" అని చెప్తుంది ధర్మపథం. బుద్ధుని ముఖాన చిందులు తొక్కే చిరునవ్వు కూడా "నీవు యిట్టి స్థితిని పొందగలవు. అమృతత్వానికి ద్వారాలు తెరచే వున్నాయి" అన్న భావాన్ని వ్యక్తం చేస్తుంది. బుద్ధుడు జ్ఞానం పొందగానే చాటాడు –

"దోషాన్ని పరిహరించుకొన్న మహనీయులు నావలెనే విజయం సాధిస్తారు" అని.

బుద్ధుడు మార్గాన్ని చెప్పారు – అంతేగాక ఆ మార్గాన పయనించే సాధకుడు సంపాదించవలసిన సామగ్రిని కూడ సూచించారు. ఈ సామగ్రియంతా నిజంగా తనలోనే వున్నదని, మానవుడు ఆత్మోద్ధరణకు సమర్థుడని బుద్ధుడెన్నో మాట్లు నొక్కి చెప్పారు. ఈ సామాగ్రిని గురించి యెంతో సరళంగ, సంపూర్ణంగ చెప్పబడిన సూత్రమే స్మృత్యుపస్థాన సూత్రము. దాని సారాంశమే "స్మృతిని కల్గియుండు" అన్న మాటల్లో క్లుప్తంగా చెప్పవచ్చు. అంటే ఈ మనస్సును నీవు గుర్తించు. కారణం మనసులోనే అంతా వుంది. దుఃఖము, దాని ఉత్పత్తి, దాని వినాశము, అందులకవసరమైన మార్గం. వీటిలో యేది' ప్రబలంగా వుంటుందనేది కూడా మన మనస్సుమీదనే ఆధారపడుతుంది. 'గడుస్తూన్నక్షణంలోనే మనస్సు చేస్తున్న పనులు యెటువైపుగా సాగుతున్నాయి' అన్న దానిమీద మనసులో "పై నాల్గింటిలో యేది ప్రబలియున్నది' అన్నదానిమీద ఆధారపడుతుంది.

"నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి" అని చెబుతుంది స్మృత్యుపస్థానము. కాని తనపై తానే ఆధారపడగల సామర్థ్యాన్ని క్రమంగా పెంపొందించుకోవాలి. కారణం మానవులు మనస్సనే ఉపకరణాన్ని యెలా ఉపయోగించుకోవాలో తెలియక యితరుల పైన, అలవాట్లపైన ఆధారపడ్డారు. ఇలా అశ్రద్ధకు గురికావడంవల్ల మనస్సు అనే అద్భుతమైన పరికరం నమ్ముకోడానికి వీలులేనిదిగా తయారైంది. అందుకని స్మృత్యుపస్థానము, ఆత్మనిగ్రహము అనే పద్ధతి యెంత బలహీనునికైనా ఉపకరించే రీతిన సరళంగా చెప్పబడింది.

స్మృత్యుపస్థానము మనస్సుయొక్క అతి ప్రాథమికమైన 'క్రియ అయిన స్మృతి లేక గుర్తింపు అన్నదానితో ఆరంభమౌతుంది. ఈ క్రియ యెంత సుపరిచితమో, సన్నిహితమో అయ్యిందంటే – యెవడైనా దానిని ఆధారంగా తీసుకొని ఆత్మోద్ధారణకనువైన సాధనను కొనసాగించవచ్చు. ఆ స్మృతి లేక యెరుకచేత గుర్తింపబడే మొదటి విషయాలు, నిత్యజీవిత క్రియలు. వీటిని గుడ్డిగ, అలవాటు ప్రకారం గుర్తించటం మాని మరింత సన్నిహితంగా పరిశీలించి వాటిని మరింత సంకీర్ణం చేయటమే స్మృతి సాధనలో జరిగేది. ఈ విధంగా సాధనవల్ల నిత్యజీవితం సంకీర్ణమౌడం వల్ల – అంటే శ్రద్ధా జాగరూకలతో కూడినదౌటం వల్ల ఆత్మోద్ధరణసాధనలో సాధకుడికెంతో ప్రోత్సాహం లభిస్తుంది.

మానసిక స్థితిలో కూడ యెంతో అభివృద్ధి కలుగుతుంది. క్రియ, యోచనలు, ఆత్మనిగ్రహంతో కూడినవౌటం వల్ల చిత్తం శాంతిస్తుంది. వెనుక వున్న అసంతృప్తి, చికాకు, కొఱతల స్థానంలో స్వస్థత కలుగుతుంది.

ఇంకొంచెం సాధన కొనసాగాక నిత్యజీవితంలోని సామాన్య విషయాలు కూడ మహత్తరమైన జ్ఞానాన్ని బోధించేవిగా మారుతాయి. బుద్ధ ధర్మం యొక్క గంభీర సత్యాలన్నీ ప్రత్యక్షానుభవమౌతాయి. తన మనస్సు యొక్క సామర్థ్యంపై తన కెంతో విశ్వాసము, ధైర్యము యేర్పడతాయి.

సమ్యక్ స్మృతి కలిగినపుడు మనోవాక్కాయ కర్మలన్నీ దాని ఆధీనంలోకి రావడం వలన నిత్యజీవితంలో అనాలోచితంగ, అలవాటు ప్రకారం ఉద్భవించే చిక్కులను నివారించుకోవడం చేతనౌతుంది. అంటే నిత్యజీవితం చిక్కులు లేనిదిగా రూపొందుతుంది.

నానాటికి చిక్కు సమస్యలను పెంచుకుంటూ కృత్రిమమైన తంతులపై ఆధారపడేదిగా తయారౌతున్న ప్రపంచానికి తిరిగి సహజత్వము, సమస్యారహితత్వాన్ని ప్రసాదిస్తుంది స్మృత్యుపస్థానము. ఇందువల్ల జీవితం సుగమం అవటమే కాక సాధనలో కూడా స్వయంప్రతిపత్తి నిస్తుంది. అంతేగాక యిలోపల యిటువంటి కష్టమైన చిక్కు ప్రపంచంలో సాధకుడికి సమస్యనెదుర్కొనే సామర్థ్యానిస్తుంది. అనుక్షణమూ మారుతుండే పరిస్థితులకు సులభంగాను, సమర్థవంతంగాను తగురీతిన సర్దుకుపోవటం – అంటే అనుగుణంగా నడుచుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. ఔచిత్యాన్ని గూర్చిన శుద్ధ అవగాహన ద్వారా ప్రాపంచికము, నైతికము అయిన

విషయాలన్నింటినీ ఆత్మనిగ్రహంతో సకాలంలో నిర్వర్తించడం ద్వారా వాటి నన్నింటినీ వాటికతీతమైన ప్రయోజనానికి అనుగుణంగా మార్చుకొనేలా చేస్తుంది.

అవసరాలను సముచితమైన రీతిలో పరిమితం చేయడమే స్మృత్యుపస్థానం యొక్క ఆదర్శం. నూతనమైన అవసరాలను కల్పించి, ప్రచారం చేసి పెంచేటువంటి ఆధునిక రీతుల దృష్ట్యా యిది యెంతో అవసరం. ఈ ఆధునిక వైఖరే సాంఘిక, ఆర్థిక రంగాలలో పనిచేసినపుడు యుద్ధానికి ప్రథమ కారణమైన ఆశలు, దానికి ఉపకరణాలు కల్పిస్తుంది. ఈ విధంగ నానాటికి పెరిగే ఊహాజనిత ప్రభావాలకు, లోబడే మనస్సు స్వయంప్రతిపత్తి కలది యెలా కాగలదు? స్వయంప్రతిపత్తి కలగాలంటే యీ కృత్రిమమైన అవసరాలకు లోబడకుండడం అవసరం.

సాధన ఆరంభంలో సాధకుడు ధ్యానస్థితికి లేక మానసిక స్థితికి నిత్యజీవితంలోని స్థితికి గల వ్యత్యాసం పట్ల ఆందోళనపడడము. స్మృత్యుపస్థానం వలన యీ వ్యత్యాసం తగ్గించబడుతుంది. క్రమంగ జీవితం, సాధన సమైక్యము చెందుతాయి. ఈ సౌలభ్యం తెలియక నిరుత్సాహంలో ఆధ్యాత్మికం విడచి యిట్టి విషయవాంఛలకు తావివ్వడం అన్యమైన, అతీతమైన శక్తి తమనుద్ధరించాలని తలచటం జరుగుతుంది. ఈ బలహీనత స్మృత్యుపస్థాన సాధకులకు కలుగదు.

మనస్తత్వ శాస్త్రవేత్తలు మనస్సులో మూడు స్థాయిలుంటాయని (Conscious, Sub-conscious and unconscious) మానసికమైన అనేక చిక్కులకు యీ పాక్షిక ప్రజ్ఞాస్థాయి కారణం. కేవలశ్రద్ధ ద్వారా ఆ పాక్షిక ప్రజ్ఞాస్థాయితో సన్నిహితమైన పరిచయము, అవగాహన ప్రజ్ఞాస్థాయి కనుగుణంగ ఉండేటట్లు పాక్షిక ప్రజ్ఞను సంస్కరిస్తుంది. నిగ్రహం దానికి గూడా వ్యాపిస్తుంది.

స్వయంప్రతిపత్తిని సాధించటానికి స్మృత్యువస్థాన మార్గంలో బాహ్యమైన ఉపకరణాలేమి అవసరం లేదు. నిత్యజీవితమే దాని క్రియారంగము, దాని విషయము రహస్యమైన యీ ఉపదేశాలు, గుప్తమైన ఎట్టి విజ్ఞానము, కర్మకాండలతో దానిశెట్టి సంబంధములేదు. తన సామర్థ్యంతోనే తాను బుద్ధత్వం పొందుతాడు.

ఈ మార్గంలో సామాన్య జీవిత పరిస్థితులే సాధనకుపకరిస్తాయి. కనుక సంపూర్ణమైన యేకాంతము, సన్యాసము అవసరంలేదు. కొందరు వీటినాశ్రయించిన అది కేవలం వ్యక్తిగతమైన అవసరం, కోరిక మాత్రమే. అయినప్పటికి అప్పుడప్పుడు కొద్దిగ యేకాంతమును అభ్యసించటం నిర్దుష్టమైన సాధనకు దాని వేగాన్ని పెంచటానికి సహకరిస్తుంది.

కర్మ సిద్ధాంతం మీద ఆధారపడటం వల్ల తన కర్మ ఫలితానికి తానే బాధ్యుడనని తెలుసుకోవటం వల్ల తనను వేరొక దైవకృప రక్షిస్తుంది అనే విశ్వాసంతో గాని, తన తరపున మరొకరు పూజా పునస్కారాలు చేసి తనకు ఫలితాన్ని ప్రసాదిస్తారన్న విశ్వాసాలతో యీ సాధనకెట్టి సంబంధమూ లేదు. తన ముక్తిని తానే సాధించుకొనే పద్ధతి స్మృత్యుపస్థానము.

ఈ మార్గంలో దేన్నీ నమ్మవలసిన పనిలేదు. బాహ్యమైన యేయితర ఆధారాలు అవసరంలేదు. స్వానుభవం వల్ల కలిగిన అవగాహనమీదనే ఆధారపడుతుంది. సత్యమైన జ్ఞానానికి జీవనాడియైన ప్రత్యక్షానుభవాన్ని యెలా పరిశుద్ధం చేసుకోవాలో విస్తారము, అగాధము చేసుకోవాలో నేర్పుతుంది. బుద్ధుడి యొక్క ఉపదేశాన్ని కూడ సాధకుడు తన కంటే ముందు ఆ మార్గాన్ని సంపూర్ణంగ అనుసరించి స్వానుభవంతో యిచ్చిన వివరమైన సూచనలుగ మాత్రమే స్వీకరిస్తాడు. అయినా యెంత వరకు తనకనుభవగతమౌతుందో అంతవరకే ఆ ఉపదేశం తన అనుభవంచేత నిరూపించబడిన నిజమైన జ్ఞానంగా రూపొందుతుంది. బుద్ధుడు తన నిర్యాణానికి ముందు ఆనందుడితో **"శిష్యుడు మార్గము, లక్ష్యాల గూర్చిన పరిజ్ఞానాన్ని గురువునుండి విన్నాక అతని సాధన సఫలం కావడానికి రెండు నియమాలను పాటిస్తే చాలు. ఒకటి సాధన ప్రారంభించటము, రెండు కొనసాగిస్తూండటము."**

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

## అధ్యాయం - 5

## సాధన - పరిశోధన

నిద్రను జయించాలన్న యత్నంలో ఆయన ఎన్నుకొనిన విధానం ఎంతో ఆశ్చర్యకరంగా వుంటుంది. ఆయన ఒక చిన్న ప్రమిదెలో కొద్దిగా నూనె పోసి వత్తివేసి దీపం వెలిగించేవారు. ఆ ప్రమిదెలోని నూనె సరిగ్గా పదిహేను నిమిషాలు మాత్రమే దీపం వెలిగేందుకు సరిపోతుంది. ఆ తర్వాత ప్రమిదెను నూనెతో నింపకపోతే దీపం ఆరిపోతుంది. దీపం ఆరిపోకుండా నూనె నింపుతూ ఎన్నో రాత్రులు, పగళ్ళు గడుపుతూ ఆయన నిద్రకు దూరమైనారు. ఆ విధంగా ఆయన నిద్రను జయించగలిగారు.

ఆహారము, నీరు, నిద్ర, మలమూత్ర విసర్జన వంటి అతిముఖ్యమైన శారీరక అవసరాలను తీర్చుకొనకుండా మనిషి ఎంతకాలం జీవించి వుండే అవకాశం వున్నదో, అంతకు మూడురెట్లు కాలం ఆయన ఆ ప్రాథమిక అవసరాలు నెరవేర్చకుండా గడిపారు.

ఈ సాధనా సమయంలో ఆయన తమ శరీరము, మనస్సు ఎప్పుడైనా ప్రతికూలిస్తే ఆ తప్పిదానికి తమకు తాము విధించుకొనే శిక్షలు తీవ్రంగా వుండేవి.

నిద్రపోకుండా ఎన్నో రోజులు గడిపిన సందర్భంలో ఒకసారి కొన్ని సెకండ్ల కాలం ఆయనకు నిద్ర తూగింది. మరుక్షణం మేల్కొన్న భరద్వాజగారు పట్టరాని ఆగ్రహంతో తమ కుడిచేతిని గోడకేసి బలంగా కొట్టగా ఆ తీవ్రమైన దెబ్బకు చేతి వేళ్ళ గోళ్ళు పైకి లేచి రక్తం ధారలుగా కారింది. తీవ్రమైన నొప్పితో శరీరం విలవిలలాడిపోగా భరింపరాని బాధతో ఆయనకు కొన్ని రోజులు నిద్ర పట్టలేదు. నిద్ర పట్టకూడదన్న తమ యత్నం యీ విధంగా ఫలించినందుకు ఆయన ఎంతో ఆనందించారు.

బయటకు వెళ్ళాలని, రోడ్డుపై సరదాగా నడవాలనీ అనిపిస్తే రోజుల తరబడి యింటి గడప దాటకుండా యింట్లోనే వుండిపోయేవారు. బయటకు వెళ్ళేందుకు బద్ధకంగా అనిపిస్తే గంటల తరబడి రోడ్డుపై నడుస్తూనే వుండేవారు. నడచి, నడచి కాళ్ళు వాచి యిక నడవలేక అడుగులు తడబడి క్రింద పడిపోయే పరిస్థితి వచ్చేవరకు అలా నడుస్తూనే వుండేవారు. ఒకేచోట ఆసనంపై కదలకుండా రోజుల తరబడి కూర్చుని గడిపేవారు. వాక్కును నియంత్రించే యత్నంలో ఎన్ని గంటలయినా మాట్లాడుతుండటం, ఎంతకాలమైనా మౌనంగా వుండడం చేసేవారు. దీర్ఘకాలం స్థిరాసనంలో కూర్చుని ఆసన సిద్ధిని సాధించే యత్నం చేసేవారు.

మాస్టరుగారి అన్నగారైన శ్రీ వేదవ్యాస రాజమండ్రిలో I.A.S. ఆఫీసరుగా కొంతకాలం పనిచేశారు. ఆ సమయంలో శ్రీ భరద్వాజగారు వారింట్లో కొన్నాళ్ళున్నారు. అప్పుడు కూడా ఆయన తమ సాధనను కొనసాగిస్తూనే వున్నారు. ఆయన ఆ రోజుల్లో తరచు గోదావరి నదికి వెళ్ళి అక్కడ నుండి బోటులో పాపికొండల వరకు వెళ్ళేవారు. అక్కడ బోటు దిగి ఆ కొండల్లో, గుహల్లో 3, 4 రోజులు ధ్యానంలో గడిపి వచ్చేవారు. బోటువాడితో మళ్ళీ నాలుగు రోజులకు తిరిగి అదే ప్రదేశానికి రమ్మని, తమను మళ్ళీ బోటులో ఊరి వద్ద నది ఒడ్డుకు చేర్చమనీ చెప్పి తాము కొండకోనల్లోకి సాగిపోయేవారు.

- సశేషం

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

వింధ్యాచలంలో నివసిస్తున్న విరాజమోహిని అనే భక్తురాలు కూడా అమ్మ ఆశీస్సులతో ఆధ్యాత్మికంగా వృద్ధిరించబడింది. ఈమె కలకత్తా నివాసి. లోగడ, కలకత్తాలోని జ్ఞాన బ్రహ్మచారి అనే యోగి సత్సాంగత్యంలో కొన్నాళ్లు గడిపింది ఆ వితంతువు. ఆమె తన యిద్దరు కుమారులను పెంచి, పెద్దవారిని చేసి, వివాహములు కూడా చేసిన తర్వాత గృహపరిత్యాగం చేసి అమ్మ సన్నిధిలో ఆధ్యాత్మిక జీవితం గడిపింది.

ఢాకాలో వుండే అమ్మ భక్తుడు ప్రమథబాబు తరచూ శ్రీ ఆనందమయి అమ్మను దర్శిస్తుండేవాడు. అతని పెద్ద కుమారుడు, కుమార్తె ఒకసారి అమ్మను దర్శించి అమ్మకు చాలా పెద్ద అంచు వున్న చీరను సమర్పించారు. వారు తాము సమర్పించుకొన్న చీరను దయతో ఒక్కసారైనా ధరించవలసిదంటూ శ్రీ ఆనందమయి అమ్మను యెంతగానో వేడుకున్నారు. బెంగాలీ స్త్రీలు సాధారణంగా యిటువంటి చీరలు ధరించడానికి యిష్టపడరు. పైగా అంతకుముందు కొంతకాలంగా అమ్మ అంచులేని చీరెలను మాత్రమే ధరిస్తున్నారు. అయినప్పటికీ అమ్మ వారి ప్రార్థనను మన్నించి ఆ చీరెను ధరించి వాళ్ళను సంతోషపెట్టారు.

అమ్మను అమితంగా ప్రేమించే భక్తురాలు శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారి సతీమణి శ్రీమతి కమలా నెహ్రూ. అమ్మను ఆమె తరచూ దర్శిస్తుండేవారు. ఉత్తర భారతదేశంలో డెహ్రాడూన్, మసూరి, ఋషికేష్, హరిద్వార్, లక్ష్మణ్ ఝులా – యిలా శ్రీ ఆనందమయి మాత యెక్కడ వుంటే అక్కడకి అమ్మ దర్శనార్థం వెళ్తుండేవారు శ్రీమతి కమలానెహ్రూ. ముఖ్యంగా అమ్మ పాల్గొనే పెద్దపెద్ద వుత్సవాలలో తప్పనిసరిగా పాల్గొంటుండేవారు. అమ్మ కనఖల్ నుండి మసూరి వెళ్లి అక్కడ రెండు నెలలు వున్నారు ఆ సమయంలో శ్రీమతి కమలానెహ్రూ చాలా రోజులు అమ్మ సన్నిధిలో వున్నారు.

కనఖల్ లో 20 రోజులున్న తర్వాత శ్రీ ఆనందమయి మాత గురుప్రియను, శ్రీ అఖండానందగిరి స్వామిని బదరీనారాయణ క్షేత్రానికి వెళ్ళవలసిందిగా ఆదేశించడంతో వాళ్లు అక్కడికి వెళ్ళిపోయారు.

శ్రీ ఆనందమయి అమ్మ కనఖల్ నుండి గిరిడీహ్ వెళ్లి అటు నుండి కాశీ వెళ్లారు. కాశీలో నిర్మలబాబు యింటిలో అమ్మ విడిది చేశారు. కాశీలోని కుంజ మోహన ముఖోపాధ్యాయగారు కూడా అమ్మ వచ్చిన నాటి నుండి ప్రతి నిత్యం నిర్మలబాబు యింటికి వచ్చి రోజంతా అమ్మ సన్నిధిలోనే గడిపి వెళ్తుండేవారు.

కాశి పట్టణంలో బాగా పేరు ప్రతిష్టలు గల వ్యక్తి కుంజమోహన ముఖోపాధ్యాయ. ఆయన బాగా ధనవంతుడు. అయినప్పటికీ భోగవిలాసాలకు ప్రాధాన్యతనివ్వక ప్రాచీన సాంప్రదాయాలను పాటిస్తూ దైవచింతనలో కాలం గడిపేవారు. ఆయన భార్యకు శ్రీ ఆనందమయి అమ్మపై యెనలేని ప్రేమ. ఆమె కూడా నిత్యం అమ్మను దర్శించేది. సాధారణంగా ఆమె యెక్కువగా బయటకు వచ్చి యెరుగదు. అతిదగ్గర ప్రాంతానికి వెళ్లాలన్నా, చివరకు గంగాస్నానానికి వెళ్లేందుకు కూడా ఆమెను కుంజమోహన్ గారు కారులో తీసుకొని వెళ్లేవారే గాని, రోడ్డుపై ఆమెను నడవనిచ్చేవారు కాదు. ఒకనాటి రాత్రి రెండు గంటలైనా ఆమెకు నిద్ర పట్టలేదు. కారణం ఆమెకు వున్నట్టుండి అమ్మను దర్శించాలని తీవ్రంగా అనిపించసాగింది. కొంతసేపటికి పడకమీద నుండి లేచి ఇల్లంతా కలయదిరిగింది. ఇంట్లో అందరూ గాఢనిద్రలో వున్నారు. ఎవ్వరికి నిద్రాభంగం కావించటానికి యిష్టపడక ఒంటరిగానే అమ్మ వద్దకు వెళ్లాలని అనుకుంది. గదిలో గోడపై హేంగరుకు తగిలించి వున్న మగవారి కోటును తీసి ధరించింది. చిన్న దుప్పటితో తలగుడ్డ

చుట్టుకుంది. చేతిలో ఒకలాఠీ తీసుకొని బయటకు వచ్చింది. సందుగొందులలో నుండి నడుచుకుంటూ నిర్మలబాబు యింటికి చేరుకుంది. పెద్దగా నిర్మలబాబును కేకలు వేస్తూ పిలుస్తున్న ఆమె అరుపులకు కంగారుగా గేటు తలుపులు తీసిన నిర్మలబాబు భార్య ఆ వేషంలో కుంజమోహన్ గారి భార్యని చూసి నిశ్చేష్టురాలయింది. లోపలికి వచ్చి అమ్మ పాదాలపై పడి నమస్కరించి ఆ రాత్రి తాను అమ్మ దర్శనం కోసం పడిన అవస్థనంతా చెప్పింది. అమ్మతో సహా అందరూ నవ్వసాగారు.

1934, 1935 సంవత్సరాలలో వైశాఖమాసంలో అమ్మ జన్మదిన వేడుకలు అన్ని ప్రాంతాలలోని భక్తులు యెంతో వైభవోపేతంగా జరుపుకున్నారు. అమ్మ 1935వ సంవత్సరంలో కాశీకి వచ్చినప్పుడు పాండే ధర్మశాలలో దిగారు. ఆ సమయంలో గురుప్రియను, శ్రీ అఖండానందగిరి స్వామిని కాశీకి రావాల్సిందిగా అమ్మ కబురు చేయటంతో వారిరువురు కాశీ వచ్చారు. శ్రీ ఆనందమయి అమ్మ కొంతకాలంగా యే వూరు వెళ్ళినా గృహస్థుల యిండ్లలో విడిది చేయడం మానివేశారు. ఆమె కేవలం దేవాలయ ప్రాంగణాలలోనూ, ధర్మశాలలలో మాత్రమే వుండసాగారు. చాలాకాలం తర్వాత పాండే ధర్మశాలలో శ్రీ ఆనందమయి మాతను దర్శించుకున్న గురుప్రియ, శ్రీ అఖండానందగిరి స్వాముల ఆనందానికి అవధులు లేవు. కాశీలో ధర్మశాల ప్రాంగణమంతా అమ్మ దర్శనార్థం వచ్చే భక్తులతో నిండిపోయింది. గోపిబాబు అనే వ్యక్తి, కాశీ నివాసి- మొట్టమొదటిగా కాశీలో అమ్మను దర్శించుకున్నాడు. మొట్టమొదటి దర్శనంతోనే అతడు అమ్మ పట్ల ఆకర్షితుడై అమ్మకు గొప్ప భక్తుడిగా మారిపోయాడు.

గోపిబాబు కాశీలోని విశుద్ధానంద స్వామి అనే యోగి పుంగవుని శిష్యుడు. అతడు ఒకరోజు అమ్మను తన గురుదేవుల వద్దకు తీసుకొని వెళ్ళాడు. విశుద్ధానంద స్వామి అమ్మను దర్శించి ఎంతో ఆనందించారు. అమ్మతో ఆయన చాలాసేపు ఆధ్యాత్మిక చర్చలు జరిపారు. 'యోగసిద్ధుల' గురించి మాట్లాడుకుంటున్న సమయంలో అమ్మ నవ్వుతూ స్వామిని తన సిద్ధుల గురించిన కొన్ని నిదర్శనలను చూపమని కోరారు. అప్పుడు విశుద్ధానంద స్వామి ఒక పుష్పాన్ని చేతిలోకి తీసుకొని దానిని స్ఫటికమణిగా మార్చి చూపారు. ఆ తర్వాత ఒక క్రొత్త రుమాలును తీసుకొని దాని నుండి దట్టమైన గులాబీ పువ్వుల పరిమళాన్ని వెలువడే లాగా మహిమ చేసి చూపారు. అప్పుడు గోపిబాబు అమ్మతో "అమ్మా! మీరు ఎంతో మధురమైన కంఠస్వరంతో దైవసంకీర్తనలు, భజనలు చేస్తారని అందరూ చెపుతారు. మాపై దయతో కొన్ని పాటలు పాడండి" అంటూ వేడుకొనగా అమ్మ యిలా పాడారు.

***1. "ఆభార్ కి నామ్ కో థాయ్ వాసే  ధామ్  స్థిర నాహి***
***తార్ బలికి కరే***
***బలిబకి ఆర్ ఆమీ నహీ కార్***
***పితా మాతా హోనా, హే చిలో జానినే కేహ్ త బలే నా***
***హోతా హో నా సునీ  పతి గుణా దాల్ కపాలే ఆమార్***
***స్మశానే మశానే, కిహలోకి జానీ  సేయాతనా బుగే హయే***
***గృహత్యాగే  సంసార్ విరాగి ఫిరి వనే- వనే***
***అనిల్ సేవనే జీవన ధారణో***
***ఆచ్చి యేకాకినీ  ప్రీతి సమరే"***

**2.** **మా ఆభార్ దయాకరే,**
**శిశురమతన కరే రాక్**
**శైశ వేర సౌందర్య ఛేదే,**
**బడా హోతే దివో నాకో**
**శాస్త్రపదే జ్ఞానీహతే,**
**సాధనాయి మా ఆర్ మనేతే,**
**లుకియేధా కబ్ తోర ఖోలేతే**
**ధాకతే ఛాయా మాశిశుర ధాక్**
**క్షుదతేలే కాకరస్వరే,**
**శిశుజే మన మాకరే,**
**భయపాయిలే నాహిధలే,**
**పాయిలేసే మాయే రలా!**
**యమవి ఆమార శిశురధారా**
**కరే రాఖ్ మా జన్మభరా**
**శరీరబాడుక తాయిక్షతినాయి**
**మనటి ఆభార శిశిరాఖ్**

ఇలా అమ్మ స్వయంగా దైవ సంకీర్తనలు పాడి, తన మధుర గానంతో భక్తులలో భక్తి భావనలను పెంపొందిస్తుండేవారు. స్వయంగా తాను భజనలు చేస్తూ అందరి చేత చేయిస్తుండేవారు. "నామ సంకీర్తనతో ఆ ప్రదేశమంతా పవిత్రమవుతుంది. సంకీర్తన చేసేవారు, వినేవారు కూడా పవిత్రులవుతారు" అనేవారు శ్రీ ఆనందమయి అమ్మ.

**- సశేషం**

# పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల 36వ ఆరాధనా మహోత్సవం!

*శ్రీమతి టి. పద్మావతి*

ఏప్రిల్ 12వ తేదీ, 2025వ సంవత్సరం, దివ్యజనని 'శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము' గుమ్మళంపాడు నందు పూజ్య గురుదేవుల ఆరాధన మహోత్సవము వైభవంగా జరిగింది. 12వ తేదీ తెల్లవారేసరికి శ్రీ సాయినాథులవారిని, పూజ్యశ్రీ భరద్వాజలవారిని, పూజ్యశ్రీ అమ్మగారిని అద్భుతంగా అలంకరించి ఆసీనులను గావించారు. సన్నిధానము ప్రాంతమంతా చక్కటి రంగవల్లులతో తీర్చిదిద్దారు.

ఆ రోజు వుదయం పూజ్యశ్రీ అలివేలుమంగా భరద్వాజ గురుదేవుల మేలుకొలుపుతో వుత్సవం మొదలైంది. కాకడ ఆరతి, కాఫీ నివేదన అనంతరం పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకం జరిగింది. తరువాత డ్రైఫ్రూట్స్ తో పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని అత్యంత రమణీయంగా అలంకరించారు. తదుపరి అల్పాహార నివేదన జరిగింది.

గురుపుత్రులు శ్రీ ద్వారక బాబుగారు 'శ్రీ గురుభరద్వాజ బృందావనం' ఒంగోలు నుండి పూజన సేవాది కార్యక్రమాలు ముగించుకుని అక్కడి భక్తులు కూడా వచ్చాక అందరితో కలిసి పూజ చేయాలని నిర్ణయించారు. వారు కొద్దిసేపు సన్నిధిలో సత్సంగం చేశారు. మధ్యాహ్నం మహానివేదన అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావన దర్శనానంతరము ఆ భక్తులందరూ కూడా పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి తరలి వచ్చారు. అప్పుడు గురుపుత్రులు శ్రీ ద్వారక బాబుగారు సత్సంగం చేశారు.

**గురుపుత్రుల సత్సంగంలోని ముఖ్య విషయాలు:**

పూజ్యశ్రీ మాస్టరుగారిని ఎవరో 'మీరు ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు కదా' అని అడిగితే, "నాకు బాబాయే ఇన్సూరెన్స్" అని చెప్పారట. అలాగని లౌకికంగా జాగ్రత్తగా లేరని కాదు. బాబా మీద తప్ప, దేనిమీదా ఆధార పడవలసిన అవసరం లేదని ఆయన విశ్వాసం. మనకి పూజ్యశ్రీ మాస్టరుగారి పట్ల అంతటి విశ్వాసం వుందా? కనీసం పరీక్ష చేసుకోవడానికి కూడా మనకి భయంగా వుంటుంది.

బాబా చూసుకుంటారని, మనకున్నవన్నీ బాబాకు సమర్పించి బతకగలమా? కొద్దో గొప్పో అనుమానం వుంటుంది. అనుమానం ఎక్కడ వుంటుంది అంటే, ఆయన గొప్పదనం మీద వుండదు, మనకి ఆయన పలుకుతాడా లేదా అన్నది సమస్య. మన గురించి మనకి బాగా తెలియడం వల్ల ఆయన పలకడేమోనని భయం. అందుకని కాసేపు భగవంతుడు అంటాం, కాసేపు లౌకిక జీవితం అంటాం. ఈ రెండిటి మధ్యలో ఊగుతుంది బండి.

పూజ్యశ్రీ మాస్టరుగారు లేదా గురువు లేదా భగవంతుడు, 'అన్నిట్లో తానే వుండి ఈ విశ్వాన్ని మొత్తం నడిపిస్తున్నారు' అన్న అవగాహన మనలో వుంటేనే కానీ, 'ఆయనే అన్నీ చేస్తున్నాడు మనల్ని కాపాడగలడు' అన్న విశ్వాసం మనలో రాదు. అంటే సాటి మనుషుల్లోనూ, సాటి పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోని సకల జీవుల్లోనూ పనిచేసే ప్రాణశక్తి వారే కాబట్టి, ఎవరైనా మనకి కీడు చేద్దామనుకున్నా లేదా మనకే కష్టాలు వచ్చినా, ఆ పరిస్థితులను కల్పించేది వారే కనుక, దాన్ని తప్పించగలిగేది, మార్చగలిగేది వారేనని,

వారి పేరే భరద్వాజ, వారి పేరే శిరిడీవాసుడు, వారిపేరే దత్తాత్రేయుడు – అని తెలిసేదాకా, 'వారు గొప్పవారే కానీ నన్ను కాపాడరేమో' అనే అనుమానం పోదు.

ఇదే భక్తికి అన్నింటికంటే పెద్ద అడ్డం. అందువల్లే ఎప్పటికీ విశ్వాసం కుదరదు. కుదరాలంటే 'ఈ సకల విశ్వరూపంలో భగవంతుడే, సద్గురువే వున్నాడు' అని తెలియాలి. అదే గురుగీత లో "గురుమధ్యే స్థితం విశ్వం" శ్లోకంలో చెప్పబడి వుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు తన ప్రతి సత్సంగము ఈ శ్లోకంతో మొదలుపెట్టేవారు. "గురువు యందే ఈ విశ్వమంతా వుంది. ఈ విశ్వమంతటా గురువే నిండి వున్నాడు. ఈ విశ్వంలో గురువు తప్ప మరి ఏమీ లేదు. అటువంటి గురువుకు నమస్కారం" అని ఆ శ్లోకానికి అర్థం.

'నీలో వున్న ప్రాణశక్తితో సహా నీవు చూసే మొత్తం కూడా భగవంతుని అధీనం లో వుంది, భగవంతుని స్వరూపంగా వుంది' అని నువ్వు గుర్తుపెట్టుకోగలిగితే అది అట్లాగే ప్రవర్తిస్తుంది. ఇది వారు ప్రతిపాదించిన ముఖ్యమైన బోధ!! ఇది ఎంతవరకు నాలో నిలబడుతుందో అంత మేరకు ఈ సృష్టి మొత్తం వారి అనుగ్రహంగా నాకు అనుభవం అవుతుంది. అంతేకాదు, ఈ సృష్టి అంతా గురువై ప్రవర్తిస్తుంది. ఇది రూఢీ అయిన రోజు దేవుడి మీద నమ్మకం కుదురుతుంది. అంతవరకు కుదిరే అవకాశమే లేదు. పూజ్యశ్రీ మాస్టరుగారితో సహా మహాత్ములందరి బోధలోనూ సాధారణంగా వుండేది ఏమిటంటే, అన్నింటిలోనూ, అంతటా ప్రవర్తించేది భగవంతుడే అని!. ఇలా ప్రయత్నం చేస్తుంటే, 'మనకి ఋణానుబంధంగా ఎంతరావాలో అంత వరకే వస్తుంది' అన్నది కూడా అవగాహనకి వస్తుంది. ఉదాహరణకి మనతో ఎవడైనా గొడవపడితే ఋణానుబంధంగా మనకి 8 దెబ్బలు తినే యోగం వుంటే, అంతవరకే వాడు మనల్ని కొట్టగలుగుతాడు. తొమ్మిదవ దెబ్బ కొట్టమన్నా కొట్టలేడు. ఎందుకంటే వాడిరూపంలో కర్మ ప్రదాతగా వ్యవహరించేది భగవంతుడే కాబట్టి. అందువల్ల వారు తప్ప దిక్కులేదు.

సాధారణంగా మన జీవితాల్లో అనుకున్నవి జరగవు, వద్దనుకున్నవి జరుగుతాయి. కనుక ఎవరి జీవితమూ హాయిగా వుండే ప్రశ్నే లేదు. మధ్యలో వచ్చిన కష్టాలు నివారించుకోవడానికి ఎవరో ఒకరి సహాయం అడిగి, వారు చెప్పినట్లు పూజగాని, పారాయణ గాని చేసాక ఆ కష్టం తీరుతుంది. తర్వాత మళ్ళీ ఇంకొక కష్టం వచ్చినప్పుడు వారి చరిత్ర వల్ల కదా మన కష్టం తీరిందనే అవగాహన లేక అది చేసుకోవడం మానేసి, ఆ ప్రశ్న చెప్పినవాడి దగ్గరకి పోయి మళ్ళీ అభ్యర్థిస్తాం. ఇలా ఆధ్యాత్మికత చెడుతుంది.

కనుక పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన శ్రీ సాయిలీలామృతము, శ్రీ గురుచరిత్ర, ప్రబోధామృతము, ఏది నిజం ఇత్యాది గ్రంథాలతో పాటు, వారు వ్రాసిన ఇతర మహాత్ముల చరిత్రలు జాగ్రత్తగా చదువుకుంటూ, అందులో చెప్పినట్టుగా ఈ సృష్టి మొత్తం భగవంతుడే అని తిరిగి తిరిగి జ్ఞాపకం చేసుకుంటూ వుండడం ఒక్కటే మార్గం.

ఈ విషయాన్ని క్రీస్తు కానీ, కృష్ణుడు కానీ, గురువు కానీ ఎంతగా చెప్పినా అన్ని మతాల్లోనూ అసహనం, యుద్ధాలు, ఇళ్లల్లో గొడవలు, వ్యాపారంలో మోసాలు ప్రపంచమంతా జరగడం చూస్తున్నాం. ఒకసారి ఒకవూరి దేవాలయంలో దొంగలు పడి, దేవుడి విగ్రహాలు దోచేశారు. 'తన గుళ్ళో విగ్రహాలనే కాపాడలేని వాడు, మనల్ని ఎలా రక్షిస్తాడు' అని ఒక నాస్తికుడు వార్తాపత్రికలో వ్యాసం రాశాడు 1984లో. దానికి పూజ్యశ్రీ మాస్టరుగారు సాయిబాబా పత్రికలో సమాధానం రాశారు. "ఆయన అడిగాడా నిన్ను నగలు తెచ్చి పెట్టమని? నువ్వు తెచ్చిపెడితే ఏమీ అనలేదు. ఇంకోడు వచ్చి తీసుకెళ్లాడు, వాడినీ ఏమనలేదు, ఎందుకంటే వాడు చేసుకున్న దాన్ని బట్టి వాడికి ఫలితం, నువ్వు చేసుకున్న దాన్నిబట్టి నీకు ఫలితం. అందర్నీ సమానంగా చూస్తాడు కనుక దేవుడు గొప్పవాడు" అని మాస్టరుగారు సమాధానం రాశారు. అట్లాంటివి చదువుకుని, ఇన్ని రూపాల్లో వుండి, వారే అన్నీ సంకల్పిస్తున్నారని, నడిపిస్తున్నారని ఆలోచించుకోవాలి.

ఈ భావాన్ని పెట్టుకొని ఒకరిపట్ల ఒకరు మంచిగా వుండడం, ఎవరైనా తేడాగా ప్రవర్తిస్తే క్షమించమని అడగడం, అవసరమైతే క్రోధం లేకుండా ధర్మంగా ఎదిరించి, ధర్మంగా వుండటమే వారి సేవ అని గుర్తించి చేయడం,,, ఇలా ప్రయత్నం చేయకపోతే భగవంతుని మీద విశ్వాసం రాదు. పూజ్యశ్రీ మాస్టరుగారి భక్తులమైన

మనలో కూడా చాలామంది, వారి చరిత్ర పారాయణ చేస్తూ, ఆయన సత్సంగాలు వింటూ, ఇది మన ప్రధాన కర్తవ్యంగా పెట్టుకోవడం లేదు. ఇది ముఖ్యమైన పని! మనకు మన గురువు ప్రసాదించిన నిధి ఏమిటంటే, వారి గ్రంథాల రూపంలో, సత్సంగం రూపంలో అంతటా అన్నిరూపాల్లో వారే వున్నారని తెలియచేయటం. ఇది మనకివ్వబడిన వరం. ఇలాంటి ఆరాధన రోజు మనం చేసిన దర్శనం కానీ, పూజ కానీ, విశ్వరూపమైన వారి పట్ల జరుగుతుంది. కనుక ప్రతిరోజు, ప్రతిపని, వారి సేవ అవుతుంది, వారి బోధ అవుతుంది. వారు మన నుంచి ఆశించేది అది! గురువుగా వారు మనకు చేసిన ప్రత్యేకమైన ఆదేశం ఇది!!

ఇలా ఆలోచించడం పేరు తత్వచింతన, మరో పేరు లీలా చింతన!! ఇది చాలా కీలకమైనది. కనుక పూజ్యశ్రీ మాస్టరుగారి ఆరాధనా మహోత్సవ సందర్భంగా వారికి మనం పూజ చేసుకుందాం. పూజలో భావాన్ని అవగాహన చేసుకుంటూ పూజ చేసుకుందాం. మన పూజా విధానాల్లో వుద్వాసన వుండదు. ఆవాహన మాత్రమే వుంటుంది ఎందుకంటే 'అంతటా వారే వున్నారు' అన్న భావన స్థిరపడే వరకు ఆహ్వానం కొనసాగుతూనే వుంటుంది. అన్ని రూపాల్లోనూ అంతటా నువ్వే వున్నావు అన్న భావనతో ఇప్పుడు మనం చేసుకునే పూజద్వారా విశ్వమంతా వ్యాపించి వున్న పూజ్యశ్రీ మాస్టరుగారికి – మనల్ని సదా కరుణించి కాపాడి, సన్మార్గంలో నడిపించి మన జీవితాన్ని వారి సేవగా స్వీకరించమని ప్రార్థన! భక్తిశ్రద్ధలతో వారి పూజలో పాల్గొనవలసిందిగా అందరికీ ప్రార్థన!!

అని వారి సత్సంగాన్ని ముగిస్తూ,,,భక్తులందరి తరపున షోడశోపచార పూజ నిర్వహించారు.

పూజానంతరం భక్తులు ఒకొక్కరే వచ్చి నమస్కారాలర్పించి ప్రసాదం స్వీకరించారు.

తదుపరి పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో చిరంజీవ కైవల్య హృదయాంతరంగ, చిరంజీవి హన్షిత ఫణి రమణీయంగా నృత్య ప్రదర్శన చేశారు. అంతటితో పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ ఆరాధనోత్సవం ముగిసింది. ●

# వార్తాలాపము

16వ పేజీ తరువాయి

చెప్పాడు. వెంటనే సికిందరు సమాధులన్నింటినీ త్రవ్వించి వాటిలోని ధనాన్నంతా తీసుకున్నాడు.

ఈ మహా చక్రవర్తి మృత్యు సమయంలో యిలా ఆలోచించాడు: "ఈ అనంత ధనరాశులను, ఏనుగులను, గుర్రాలను, వాహనాలను, నౌకరులను, దాసదాసీజనాలను, రాణులను, ప్రజల నుండి సంపాదించిన ధనాన్ని మొదలైనవన్నీ విడచి నేను ఒంటరిగానే మృత్యుముఖంలో పడవలసివస్తోంది."

ఇలా ఆలోచించి తాను చనిపోయిన తరువాత తన రెండు చేతులను అందరికీ కనబడేటట్లు ప్రక్కలకు వేలాడేటట్లు చేయమని ఆజ్ఞాపించాడు. తాను రిక్త హస్తాలతోనే (ఖాళీ చేతులతోనే) పుట్టి, రిక్తహస్తాలతోనే ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోతున్నట్లు అందరికీ తెలియజేయడానికి తన శరీరంలోని చేతులను బయటకు కనిపించేటట్లు వుంచమని ఆజ్ఞాపించడంలో అతని ఆంతర్యము తెలియజేయబడింది. అంతేకాదు, "నా తాలూకు అనంత ధన సమృద్ధి, పుష్కలమైన సైన్యము, ఆప్తబంధువులు, వైద్యంలో రారాజులు మొదలైన వారెవరూ మృత్యుముఖం నుంచి నన్ను కాపాడలేకపోయారు. వీరందరిని విడిచి నేను ఒంటరిగానే మృత్యు ముఖంలో అలమటిస్తున్నాను" అని తెలిపాడు.

ఇలా అనేకమంది మహాత్ముల జీవిత చరిత్రలు వారి అనంతైశ్వర్యాలు నిరర్ధకమని ఘోషిస్తూ వుంటే అటువంటి వాటి వలన జ్ఞానము పొందకుండడం దౌర్భాగ్యం తప్ప వేరు కాదు.

పతంజలి యోగ సూత్రాలలో ఇలా చెప్పాడు

**సంతోషాదనుత్తమః సుఖలాభః** – అంటే సంతోషం వలన పరమోత్తమమైన సుఖం కలుగుతుంది. కాబట్టి జీవిత నిర్వహణకు అవసరమైన ధనాన్ని పొందిన వెంటనే సంతోషాన్ని అనుభవించాలి. మీకు జీవితము గడుపుకోవడానికి అవసరమైన ధనం వున్నప్పుడు మరిక ఎక్కువ ధనమేమి అవసరము?

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి పిసుపాటి సుబ్బమ్మ

## ఆ ముసలాయనెవరో కూర్చోమని చెప్పండి!

నేను న్యూఢిల్లీలో మా మూడో అబ్బాయి యింట్లో వుంటుండగా తీవ్రమైన చలి కుదుపులతో జ్వరము వచ్చినది. ఆ సమయంలో మా అబ్బాయి ఊరిలో లేడు. మా కోడలు ఒక్కతే వుండగా సాయంకాలము నాకు జ్వరము తీవ్రమయినది. అప్పుడు మా కోడలు ఇతరుల సహాయంతో నన్ను ఆస్పత్రిలో చేర్పించింది. డాక్టర్లు పరిస్థితి చాలా ప్రమాదంగా వుంది. కనుక మీ వాళ్ళందరికి టెలిగ్రాములు యిచ్చుకోమని చెప్పేశారు. అప్పుడు మా కోడలు కంగారుపడిపోయి సాయిబాబాను తల్చుకుని, "బాబా! నీ చిత్రపటం వేరు, నువ్వు వేరుకాదని చెప్పావు కదా! నా భర్త ఇంటిదగ్గర లేకుండా యిటువంటి ప్రమాదం వచ్చింది. ఆయన వచ్చేదాకా నీ సత్యం చూపించి నువ్వే కాపాడాలని నమస్కారం చేసుకుంది. డాక్టర్లు వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేశారుట. ఒకరోజంతా స్పృహలో లేకుండా పడివున్నాను. మర్నాటికి కొద్దిగా తెలివి వచ్చింది. అప్పుడు డాక్టర్లు ఇంక ఫరవా లేదన్నారట. అప్పుడు నాకు నిద్రా మెలకువా కాని పరిస్థితిలో ఎదురుగా తెల్లటి బట్టలు, గడ్డముగల ఆజానుబాహువయిన ముసలాయన కనిపిస్తున్నారు. ఆయన ఏవో మంత్రాలు చదువుతూ



చేత్తో అక్షింతలు వేస్తూ ఏదో ఆశీర్వదిస్తున్నట్టుగా నాకు చాలాసేపు కనబడింది. అప్పుడు నేను "ఆ ముసలాయన ఎవరో వచ్చి అలా నిల్చుండిపోయారు. కూచోమని చెప్పండి" అని మావాళ్ళతో చెపితే, "ఇక్కడ ఎవరూ లేరు. మాకు ఎవరూ కనపడటం లేదు" అని వాళ్ళందరూ అన్నారు. నాకు బాగా తగ్గిపోయిన తరువాత ఈ దృశ్యం అంతా వాళ్ళకు చెప్పితే "నీకు బాబాయే అలా దర్శనం యిచ్చి నిన్ను కాపాడారు. మా కెవరికీ కనపడలేదు. ఇదంతా ఆయన అనుగ్రహమే" అన్నారు. టెలిగ్రాము అందుకుని నా కుమారుడు వచ్చేటప్పటికి ప్రమాదం తప్పింది. మీరు చాలా అదృష్టవంతులని అందరూ అన్నారు. ఇది సాయిబాబా లీల. నమ్మినవాళ్ళకు తప్పక బాబా వున్నారు. ●

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీమతి కృష్ణకుమారి**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల మహోత్సవ లీలావైభవాన్ని హైదరాబాదులోని చందానగర్ వాస్తవ్యులు శ్రీమతి కృష్ణకుమారిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నాకు పెళ్లైయ్యాక మా తోడికోడలుగారి ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పరిచయమయ్యాయి. వారు ఇంట్లో సత్సంగాలు కూడా చేసేవారు. మేమూ ఆ సత్సంగాలకు హాజరయ్యేవారము. వారి సూచన మేరకు పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన మహాత్ముల చరిత్రలన్నీ పారాయణ చేశాము. శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతము మా దంపతులిద్దరమూ నిత్య పారాయణ చేసుకుంటాము. మా నాన్నగారు ఎక్కిరాల కృష్ణమాచార్యగారిని అనుసరించేవారు. మా ఇంట్లో శ్రీ కృష్ణమాచార్యగారు వ్రాసిన గ్రంథాలుండేవి. ఆ రచనలు చదవటంవల్ల, మా నాన్నగారు మాకు చిన్నప్పటినుంచి సత్ప్రవర్తనకు సంబంధించిన విషయాలు చెప్పడంవల్ల ఈ మార్గం నాకు కొత్త కాదు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన గ్రంథాలు చదివాక మహాత్ముల గురించి, అవధూతల గురించి తెలిసింది. అప్పటినుంచి 2020 వరకూ మేమిద్దరము నాగోలులో జరిగే ప్రతి కార్యక్రమానికి వెళ్ళేవారము.

దాదాపు 15 సంవత్సరాల క్రితం మొట్టమొదటిసారి కొంతమంది సత్సంగ సభ్యులతో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి మల్కాజిగిరికి వెళ్లాను. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుంటుంటే వారి పాదాలనుంచి కొన్ని కిరణాలు నాలోపలికి వచ్చి విపరీతమైన శక్తితో నన్ను పైకి లేపుతున్నట్లు అనిపించింది. అదేవిధంగా ఒంగోలు వెళ్లినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి నమస్కారం చేసుకుంటుంటే అప్పుడు కూడా ఆ సమాధినుంచి కొన్ని కిరణాలు నాలో ప్రవేశించి విపరీతమైన శక్తితో నన్ను పైకి లేపుతున్నట్లనిపించింది. ఈ అద్భుతమైన లీల వల్ల పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికీ భేదం లేదని అర్థమైంది.

నాకు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంట్లోకి నడిచి వచ్చి మా పూజగదిలో కూర్చున్నట్లు కనిపిస్తుంటారు. ఒకసారి స్వప్నంలో ఆయన మా ఇంట్లోకి నడచివస్తూ, "సముద్రమథనం చెయ్యాలి! సముద్రమథనం చెయ్యాలి!" అని రెండుసార్లు అన్నారు. ఇదే కాకుండా ఇంకొక చిత్రమైన అనుభవాన్ని కూడా పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ప్రసాదించారు. నేను ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేసేదాన్ని. మా పాఠశాల జహీరాబాద్ దగ్గరవున్న గురజవాడ అనే పల్లెటూరిలో వుండేది. సిటీలో నేనున్న ప్రాంతంనుంచి 100 కిలోమీటర్ల దూరం. ప్రతిరోజూ రానూపోనూ 200

కిలోమీటర్లు ప్రయాణం చేసేదాన్ని. ఒకసారి బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు మగవాళ్ళు ఎవరూ నా పక్కన కూర్చోకుండా నేను కిటికీ ప్రక్కగా కూర్చునే చోటును ఖాళీగా వుంచి చివరి సీటులో కూర్చున్నాను. బస్సులో ఇంకా ఖాళీ సీట్లు వున్నాయి.

కాసేపటికి ఒకాయన వచ్చి నా ప్రక్కనే నిల్చుని, నన్ను ప్రక్కకి జరగమన్నారు. నేను, "ఇంకా బస్సులో సీట్లు చాలా వున్నాయి కదా, అక్కడ కూర్చోండి!" అన్నాను. ఆయన అలా చేయకుండా, "నువ్వింత మొండిదానివి కనుకే నీ జీవితం అంత మొండిగా వుంది!" అన్నారు. అప్పుడు ఆయనను తేరిపారా చూశాను. శుభ్రమైన బట్టలు వేసుకుని, టోపీ పెట్టుకుని, బూట్లు వేసుకుని దర్జాగా వున్నారు. ఆయన అన్న మాటలకు నాకు చాలా కోపమొచ్చి, "నా జీవితం గురించి మీకేం తెలుసు?" అనడిగాను. అలా అడుగుతూ బస్సులో చుట్టూ అందరినీ చూశాను -- ఈ సంభాషణ ఎవరైనా విన్నారేమోనని! అందరూ ఎవరిపాటికి వారు కూర్చున్నారు. అయన చాలా పెద్ద గొంతుతోనే అడిగినా ఎవరూ పట్టించుకోవటం లేదు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఈలోపు దిగవలసిన ప్రదేశం రాగానే నేను దిగిపోయాను. ఆయన కూడా అక్కడే దిగి ఒకసారి వెనక్కి తిరిగి చూశారు. నేనూ చూశాను. మరుక్షణం ఆయన కనిపించలేదు!

మావారు గంగాధర్ గారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఆఫీస్ అసిస్టెంటుగా ఉద్యోగం చేసేవారు. ఆయన 2018 అక్టోబరులో పదవీ విరమణ చేశారు. నేను 2020 మార్చిలో పదవీ విరమణ చేశాను. తరవాత మేమిద్దరం దత్తక్షేత్రాలు యాత్రకి వెళదామని ప్రణాళిక వేసుకున్నాం. కానీ అక్టోబరులో నాకు కాన్సర్ అని తెలిసింది. అప్పటికే కరోనా బాగా వ్యాప్తిలో వుంది.

బసవతారకం ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాను. ఆ వైద్యవిధానంలో కీమోథెరపీ, రేడియేషన్ అన్నవి ఒక ప్రక్రియ. అయితే అవి చేస్తున్నప్పుడు ఏమైనా దుష్ప్రభావాలు రావచ్చు కనుక అటువంటప్పుడు మీ దగ్గరలో వున్న ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోండని అక్కడి వైద్యులు చెప్పారు. దాదాపు 7 సార్లు ఈ వైద్యం పూర్తయ్యే దశలో నాకు కొన్ని దుష్ప్రభావాలు వచ్చాయి. అందువల్ల మాకు దగ్గరలోవున్న సిటిజెన్ ఆసుపత్రికి వెళ్ళాము. అక్కడ నాకు పరీక్ష చేసి కరోనా అని చెప్పారు.

మేము పరీక్ష చేయించుకున్నది కోవిడ్ ఆసుపత్రి కాదు కనుక నన్ను అందులో చేర్చుకోలేదు. బసవతారకం ఆసుపత్రికి వెళ్ళమన్నారు. కానీ అక్కడ బెడ్స్ ఖాళీగా లేవన్నారు. మళ్ళీ మావారు మరొక ఆసుపత్రికి ఫోన్ చేస్తున్నారు. ఈలోగా నాకు ప్రమాదించింది. చివరకు ఈ ఆసుపత్రి చీఫ్ నాయుడుగారు మావారికి కూడా కరోనా టెస్ట్ చేశారు. వారికి లేదని రిపోర్ట్ వచ్చింది. "మీరు ఇప్పుడు ఆమెకు దగ్గరగా వుండి సేవ చెయ్యకూడదు" అని, అప్పుడు మా ఇంటి పరిస్థితి అంతా ఆయన అడిగారు. "మాకెవ్వరూ దగ్గరలో లేరు. అమ్మాయి చెన్నైలో, అబ్బాయి IAF SEARGENT గా లదాక్ లో వున్నాడు. ఇక్కడ మేమిద్దరమే వుంటాము" అని చెప్తే, "ఇప్పటివరకూ భరద్వాజ, సాయి అని ఎవరినంటున్నారు?" అనడిగారు. అంటే ఆ పేర్లు రెండూ మాకు కావలసిన వాళ్లవని ఆయన ఉద్దేశం. అప్పుడు మావారు, "భరద్వాజ అంటే మా గురువుగారు, సాయి అంటే సాయిబాబా!" అని చెప్పారు. అంతేకాదు, దాదాపు అరగంటసేపు గురుదంపతుల గురించి చెప్పించుకుని విన్నారు. చివరకు గురుదేవుల అనుగ్రహంవల్ల నన్ను అదే ఆసుపత్రిలో చేర్చుకున్నారు. అది కూడా స్పెషల్ వార్డులో! అక్కడి స్టాఫ్ ఎవరికైనా కోవిడ్ వస్తే వారికి వైద్యం కోసం ఒక స్పెషల్ వార్డ్ ఏర్పాటు చేశారు. అందులో నన్ను చేర్చుకున్నారు. అప్పుడు మావారు కృతజ్ఞతలు చెప్తే, "ఆవిడ బ్రతికితే అప్పుడు చెప్పండి!" అన్నారు. ఎందుకంటే కాన్సర్ మొండిరోగం. పైగా నాకు కరోనా మహమ్మారి సోకింది. అందువల్ల నా పరిస్థితి ప్రమాదకరంగానే వుండేది.

నేనిలా ఆసుపత్రిలో వుంటే మావారు ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారిని, పూజ్యశ్రీ అమ్మగారినీ ప్రతిరోజూ, "నా భార్యను బ్రతికించండి, లేదా నన్ను కూడా తీసుకుపోండి!" అని ఏడుస్తూ ప్రార్థన చేసేవారట. ఆసుపత్రికి వస్తే

ఇక్కడ వుండొద్దని ఇంటికి పొమ్మనేవారు. ఇంటికి వెళితే ఒక్కరూ వుండలేక బాధపడేవారు. వండుకుని తినడానికి కూడా ఓపిక వుండేది కాదు. ఆ పరిస్థితిలో చెన్నైలో వున్న మా అమ్మాయి, “we too help you” అనే సంస్థ సహాయం తీసుకొమ్మని చెప్పింది. వాళ్లకు ఫోన్ చేస్తే వాళ్ళు ఎంక్వయిరీ చేసుకుని మాకు సహాయం అందించాలని నిర్ణయించుకుని, ప్రతిరోజూ మావారికి వేడివేడి భోజనం తీసుకువచ్చి అందించేవారు. అలా నేను ఆసుపత్రినుంచి ఇంటికి వచ్చాక కూడా సహాయం చేశారు. వాళ్లకు జన్మాంతం కృతజ్ఞత కలిగి వుంటాము. ఆసుపత్రి చీఫ్ నాయుడుగారు కూడా మేము కట్టవలసిన బిల్లులో మినహాయింపు ఇచ్చారు. గురుబంధువు సులోచనగారు పూజ్యశ్రీ అమ్మగారికి, వేదమ్మగారికి నా పరిస్థితి ఎప్పటికప్పుడు తెలియచేసేవారు. ఇన్ని రోజులు కూడా వేదమ్మగారు  నా ఆరోగ్యం కోసం సత్సంగంలో ప్రార్థన చేసి పూజ్యశ్రీ  అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సులు అందించేవారు.

సాగరమథనం చేసి నా మొండి వ్యాధులనుంచి కాపాడి, ఆ  గురుదంపతులిద్దరూ తమ శక్తి కిరణాలతో నన్ను పైకి లేపి బ్రతికించారు. ఇంతకన్నా వారి అపారకరుణకు నిదర్శనం ఏం కావాలి? ఇంకా వాత్సల్యం చూపించిన సంఘటన ఒకటి  చెప్పాలి. నేను డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన తరువాత నాకు నీరసంగా వుండటం వల్ల ఏ పనీ చేయలేకపోయేదాన్ని. మావారు కూడా అంతకుముందునుంచి నాకు సేవ చేసిచేసీ శారీరికంగాను, మానసికంగానూ కృంగిపోయి, నీరసపడిపోయి వున్నారు. అటువంటి సమయంలో మేము ఎవరి ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలుసుకున్నామో, ఆ  దంపతులు -- అంటే మావారి బాబాయ్ కొడుకు భాస్కరరావుగారు, ఆయన భార్య లక్ష్మి, మమ్మల్ని వాళ్ళ ఇంటికి తీసుకువెళ్లి, ఆరునెలలపాటు మాకు ఆశ్రయమిచ్చి చక్కగా చూసుకున్నారు. ఇదంతా ఆ గురుదేవుల దయ కాక ఇంకేమిటి?

ఈ వ్యాధుల బారిన పడకముందు కూడా గురుదేవులు నన్ను, మావారినీ ఎన్నో ప్రాణగండాలనుంచి కాపాడారు. ఇలా మమ్మల్ని అనుక్షణం అనేక విషమపరిస్థితులనుంచి దాటిస్తూ కంటికి రెప్పలా కాపాడుతున్న గురుదంపతులకు కృతజ్ఞతాపూర్వక పాదాభివందన సహస్రాలు తెలియచేసుకుంటూ, జీవితాంతం మీపట్ల చెదరని భక్తిభావంతో సేవించుకునే పరిపాకాన్ని ప్రసాదించమని వేడుకుంటూ అంజలి ఘటిస్తున్నాము.●

## పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

ఆరాధించడం. శరీరంతో ఆయనకు ప్రదక్షిణ, పూజ, నమస్కారాదులు; ఆయనను స్తుతించడం, నామం జపించడం, ఆయన గూర్చి వినడం, సకల జీవులనూ యథాశక్తి సేవించడం, శరీరాన్ని అధర్మకార్యాలలో నియోగించకపోవడం, శారీరక ‘యజనం’. మనస్సును సదా ధర్మబద్ధంగా వుంచుతూ వివేకంతో యోచించి వ్యర్థ వ్యామోహాలపట్ల వైరాగ్యం చెందటం, భగవన్నియతమైన సుఖదుఃఖాలను, మరణాదులనూ గూర్చి వ్యర్థంగా చింతించకపోవడం, సచ్చింతన, ధ్యానము – ఇవి మానసిక ‘యజనం’. భగవద్గీత యీ రెంటినీ ద్రవ్యయజ్ఞాలు, తపోయజ్ఞాలు అన్నది. దేహమానసాదులతో సద్గురువును సేవించి, పరిప్రశ్న చేసి యీ విధానాన్ని తెలుసుకొని ఆచరించాలి. ఇలాచేస్తే జ్ఞానపరిపాకం కల్గి మృత్యువు నుండి విడివడతాము పండిన దోసకాయ చెట్టుతో దానికి గల బంధం (తొడిమ) నుండి దానికై అదే విడివడ్డట్లు. అనన్యమైన ఈశ్వరధ్యానం చేయమని యీ మంత్రార్థం. ఆ మంత్రం చెప్పినట్లు చేయకుండా దానిని ఉచ్చరిస్తే సరిపోతుందా? వైద్యుడు వ్రాసిచ్చిన మందులు సంపాదించి సేవించిన ఫలితం ఆయనిచ్చిన చీటీని వల్లిస్తే వస్తుందా? పైన వివరించినటువంటి సదాచారంతో గూడి మంత్ర జపాదులు చేస్తేనే మృత్యురహితస్థితి కల్గుతుందని భగవద్గీత (శ్రద్ధాత్రయ విభాగయోగం) ప్రమాణం.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ్ మహారాజ్ ఆరాధనోత్సవము ఏప్రిల్ 12, 2025న 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' గుమ్మళంపాడులో వైభవంగా జరిగింది. గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు విశేష పూజ, సత్సంగం చేసారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు భక్తిప్రపత్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము తిథుల ప్రకారం మే 21, 2025 న మరియు ఆంగ్ల కాలమాన ప్రకారం జూన్ 3, 2025 న గుమ్మళంపాడు 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' లో జరుగును. ఉత్సవాలకు సంబంధించి మరిన్ని వివరములకు శ్రీ మధు గారిని (9542985469), శ్రీ పి.రమేష్ గారిని (9440018038) సంప్రదించగలరు.